# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 35 | ఎడిటర్: మేనం శ్యామ్ | ఆదివారం 23-08-2026 | పేజీలు: 10


దేశరాజధాని ఢిల్లీలో ఈరోజు బంగారం ధర

తులం బంగారం (10 గ్రాములు)

1,47,100/- (22 క్యారెట్స్)


1,54,460/- (24 క్యారెట్స్)


## సిరా చుక్క

మార్పు..మార్పు అన్నారు
మంచి రోజులు అన్నారు
కానీ రేవంత్ రెడ్డిగారూ..
తెలంగాణ అడుగుతోంది...
"మా బతుకులు ఎక్కడ మారాయి?"
మీ ప్రజాపాలనలో దినదిన గండం...
నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా...
రైతు ఇబ్బందుల్లో...కార్మికుడు కష్టాల్లో
నిరుద్యోగి నిరాశలో...ఉద్యోగి ఒత్తిడిలో
వ్యాపారి భారాల్లో...మధ్యతరగతి అప్పుల్లో...
పేదోడు నిత్యావసరాల భారంతో...
చివరికి మీ కోసం జెండా మోసిన
కార్యకర్తకుత్యాగం ఉంది...
కానీ, గుర్తింపు లేదని
గుండెల నిండా గోడుతో ఏడుస్తున్నారు.
రేవంత్ రెడ్డిగారూ...
సీఎం కుర్చీ మీది కాదు..
ప్రజలు అప్పగించిన బాధ్యత!
ఆ బాధ్యతను మీ కుటుంబం చుట్టూ
తిప్పడానికి కాదు...
నాలుగు కోట్ల
తెలంగాణ ప్రజల చుట్టూ తిప్పడానికి!
సీఎం గారూ ...
ప్రజలు ప్రశ్నిస్తున్నారు..
ఇక జవాబు చెప్పాల్సింది మీరే!
లేదంటే.. ఈరోజు ప్రశ్న...
రేపటి తీర్పు కావచ్చు!

– కనకమామిడి సన్నీ..,







# గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం

## ఏడంతస్తుల భవనం కుప్పకూలింది

- 50 గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణం
- భవనం పక్కకు ఒరిగి వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పై కూలడంతో ఇద్దరి మృతి
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స



**ప్రజావాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలు మరోసారి ప్రాణాల మీదకు తెచ్చాయి. మాదాపూర్ సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో శనివారం ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. కేవలం 50 గజాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ భవనం ఒక్కసారిగా పక్కకు ఒరిగి సమీపంలోని వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పై కూలిపోయింది.

ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

**ఇద్దరి ప్రాణాలు బలి..**

భవనం కుప్పకూలిన ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన మహబత్, ఉమేశ్ మృతి చెందారు. మరో వ్యక్తి రమణారెడ్డి తీవ్రంగా గాయపడటంతో స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భవనం కూలిన సమయంలో భారీగా శిథిలాలు పడటంతో పక్కనే ఉన్న వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్ కూడా పాక్షికంగా దెబ్బతింది.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగిస్తూ.. మరెవరైనా భవనం కింద చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చేపట్టారు.

**అనుమతుల్లేకుండానే ఏడంతస్తుల నిర్మాణం?**

ఈ భవన నిర్మాణానికి సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేవని అధికారులు గుర్తించినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతో గతంలోనే టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగడం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది.అంజయ్య నగర్‌లో కేవలం 50 గజాల స్థలంలోనే ఏడంతస్తుల భవనం నిర్మించడం నిర్మాణ నిబంధనల ఉల్లంఘనకు నిదర్శనమని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇంత చిన్న స్థలంలో భారీ భవనం నిర్మిస్తే దాని పటిష్టత, భద్రతపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి.

**ఖాజా నిర్మాణంపై స్థానికుల ఫిర్యాదులు?**

అక్రమంగా ఈ భవన నిర్మాణాన్ని ఖాజా అనే

మిగతా 2లో

# లండన్‌లో సీఎం రేవంత్..

## తెలంగాణకు అంతర్జాతీయ భాగస్వామ్యాలు

- లివర్‌పూల్ ప్రతినిధులతో సీఎం కీలక భేటీ
- లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలపై భాగస్వామ్య చర్చలు
- అక్టోబర్‌లో హైదరాబాద్‌కు లివర్‌పూల్ బృందం
- ఇంపీరియల్ కాలేజీతో విద్యా సహకారంపై చర్చలు



**ప్రజావాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటనలో భాగంగా వరుసగా కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడులు, విద్య, క్రీడలు, సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలపై చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా శనివారం లండన్‌లో లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్, ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.

**లివర్‌పూల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం?**

లివర్‌పూల్ ప్రతినిధులు తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఆసక్తి చూపినట్లు సమాచారం. ముఖ్యంగా లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, క్రియేటివ్ ఎకానమీ రంగాల్లో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చలు జరిగాయి. తెలంగాణలో ఉన్న అవకాశాలు, హైదరాబాద్‌లోని మౌలిక వసతులు, పెట్టుబడులకు అనుకూల వాతావరణంపై కూడా సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది.ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు లివర్‌పూల్ ప్రతినిధుల బృందం

మిగతా 2లో

# మీర్‌పేట్‌లో దారుణం.. డబ్బు, బంగారం కోసం మహిళ హత్య

- సంపులో మహిళ మృతదేహం.. మీర్‌పేట్‌లో కలకలం
- జీతం తీసుకుని ఇంటికి వెళ్తుండగా షాపులోకి పిలిచిన నిందితుడు
- రూ.10 వేల నగదు, అర తులం బంగారం కోసం హత్య.
- సీసీ కెమెరాలతో బయటపడిన అసలు విషయం
- శ్రీకృష్ణ హాట్‌చిప్స్ యజమాని ప్రకాష్ అరెస్ట్

2 లో




# కొండా సురేఖకు అండగా నిలిచేదెవరు ?

- కాంగ్రెస్‌లో ముదురుతున్న అంతర్గత విభేదాలు
- తనను.. తన కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారన్న మంత్రి కొండా సురేఖ
- అవమానకర వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలంటూ క్రమశిక్షణ కమిటీకి లేఖ
- తనపై బహిరంగ విమర్శలు చేస్తున్న నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఇప్పటికే నోటీసుకు వివరణ ఇచ్చినా.. మళ్లీ తననే టార్గెట్ చేస్తున్నారన్న సురేఖ
- బీసీ మహిళా నాయకురాలిని టార్గెట్ చేస్తున్నా పార్టీ మౌనం వహించడం ఆందోళనకరమన్న మంత్రి కొండా సురేఖ
- సురేఖ వివరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న మల్లు రవి

**ప్రజావాయిస్, ప్రత్యేక కథనం :** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత పరిణామాలు మరోసారి రాజకీయ వేడిని పెంచుతున్నాయి. మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు పార్టీ క్రమశిక్షణ కమిటీ వరకు చేరింది. తనను, తన కుటుంబ సభ్యులను కొంతమంది నేతలు టార్గెట్ చేసి అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిస్తూ

మిగతా 2లో



# ఢిల్లీలో రిజర్వేషన్లపై మంటలు

- జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన
- రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వేలాది మంది ఆందోళన
- 'రిజర్వేషన్ హటావో ఆందోళన్'కు యువత, విద్యార్థుల మద్దతు
- కులం కాదు.. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలన్న డిమాండ్
- 'వన్ ఫ్యామిలీ.. వన్ రిజర్వేషన్' అమలు చేయాలని డిమాండ్
- రిజర్వేషన్లకు సన్‌సెట్ క్లాజ్ పెట్టాలని ఆందోళనకారుల డిమాండ్

2 లో



# బీసీలకు ఒక న్యాయం..రెడ్లకు మరో న్యాయం కాదు..

- కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోంది
- సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందన్న మల్లు రవి
- సురేఖ వివరణపై పార్టీ పెద్దలు చర్చిస్తున్నారని వెల్లడి
- రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై ఫిర్యాదు రాలేదన్న మల్లు రవి

**ప్రజావాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల నేపథ్యంలో ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని.. బీసీలను ఒకలా, రెడ్లను మరోలా చూడటం లేదని స్పష్టం చేశారు. సొంత పార్టీ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు.

**సుస్మిత వ్యాఖ్యలపై సురేఖ ఎందుకు స్పందించలేదు?**

కొండా సుస్మిత వ్యవహారంపై పార్టీ అధిష్ఠానం స్పందించిందని మల్లు రవి తెలిపారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. దీనిపై సురేఖ వాట్సాప్ ద్వారా వివరణ లేఖ పంపారని.. ఆ వివరణపై ఎలాంటి




నిర్ణయం తీసుకోవాలనే దానిపై పార్టీ పెద్దలు చర్చిస్తున్నారని వెల్లడించారు.అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగతమంటూ కొండా సురేఖ ఇచ్చిన వివరణను మల్లు రవి వ్యతిరేకించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడినప్పుడు.. మంత్రి హోదాలో ఉన్న సురేఖ స్పందించి ఖండించాల్సిందని అన్నారు.

**సీఎం, పార్టీపై వ్యాఖ్యలు చేస్తే మౌనమేనా?**

కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు సురేఖ మౌనంగా ఎందుకు ఉన్నారని మల్లు రవి ప్రశ్నించారు. పార్టీ సహజ న్యాయ సూత్రాల ప్రకారం అలాంటి వ్యాఖ్యలను ఖండించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.గతంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై కొండా సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ అంశం పార్టీలో చర్చకు దారితీసింది. ఇప్పుడు సుస్మిత వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడం.. క్రమశిక్షణ కమిటీ ముందు మరోసారి చర్చనీయాంశంగా మారింది.

**బీసీ.. రెడ్డి అంటూ వివక్ష లేదు**

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఒకలా, రెడ్లకు మరోలా వ్యవహరిస్తోందన్న ఆరోపణలను మల్లు రవి ఖండించారు. ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూస్తోందని స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత వ్యవహారాల్లోనూ ఎలాంటి వర్గ వివక్షకు తావు లేదని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.కొండా సురేఖ తనను బీసీ మహిళా నాయకురాలిగా టార్గెట్ చేస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మల్లు రవి చేసిన ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.

**రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై ఏం జరుగుతుంది?**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన అంశంపై కూడా మల్లు రవి స్పందించారు. ఇప్పటివరకు ఈ విషయంపై ఎవరూ అధికారికంగా ఫిర్యాదు చేయలేదని తెలిపారు.అయితే సమయం వచ్చినప్పుడు ఈ అంశాన్ని క్రమశిక్షణ

మిగతా 2లో

# స్కూల్‌లోకి దూసుకెళ్లిన సీజేపీ నేత.. అభిజిత్ దిప్కేపై కేసు

- పాఠశాలలోకి అనుమతి లేకుండా ప్రవేశించారన్న ఆరోపణ
- టీచర్లను బెదిరించినట్లు ఫిర్యాదు
- 'స్కూల్ లీక్ ఖరో' కార్యక్రమంలో భాగంగా ఘటన
- బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్

2 లో





# ఢిల్లీలో రిజర్వేషన్లపై మంటలు

**ప్రజావాయిస్, న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా రిజర్వేషన్ల వ్యవస్థపై భారీ నిరసన చేపట్టారు. ఇన్నాళ్లూ సోషల్ మీడియా వేదికగా సాగిన ప్రచారం ఇప్పుడు వీధి పోరాటంగా మారింది. 'రిజర్వేషన్ హటావో ఆందోళన్' పిలుపుతో జంతర్ మంతర్ వద్ద వేలాది మంది యువకులు, విద్యార్థులు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు ఆందోళనకు దిగారు. కర్ణి సేన, రణబీర్ సేన వంటి సామాజిక సంస్థలు కూడా ఈ నిరసనకు మద్దతు తెలిపాయి.

### కులం కాదు.. ఆర్థిక ప్రాతిపదిక కావాలి

ఆందోళనకారుల ప్రధాన డిమాండ్ రిజర్వేషన్లను కుల ప్రాతిపదికన కాకుండా పూర్తిగా ఆర్థిక ప్రాతిపదికన అమలు చేయాలన్నదే. పేదరికమే అర్హతకు ప్రామాణికంగా ఉండాలని.. కులంతో సంబంధం లేకుండా ఆర్థికంగా వెనుకబడిన ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విద్యార్థి హర్ష్ దూబే ప్రారంభించిన ప్రచారం అనంతరం ఈ ఉద్యమం క్రమంగా విస్తరించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. అనురాధ తివారీ, అజీత్ భారతి, నేహా దాస్ వంటి సామాజిక కార్యకర్తల మద్దతుతో ఉద్యమం మరింత విస్తరించింది.

### 'వన్ ఫ్యామిలీ.. వన్ రిజర్వేషన్'

కేవలం రిజర్వేషన్ల ప్రాతిపదికను మార్చడం మాత్రమే కాకుండా.. ప్రస్తుత రిజర్వేషన్ విధానంలో పలు మార్పులు తీసుకురావాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు.ఒక కుటుంబంలో ఒక్కసారి మాత్రమే రిజర్వేషన్ ప్రయోజనం పొందేలా 'వన్ ఫ్యామిలీ.. వన్ రిజర్వేషన్' విధానం తీసుకురావాలని కోరుతున్నారు. లబ్ధిదారుల జాబితాను క్రమం తప్పకుండా సమీక్షించి.. ఇప్పటికే ప్రయోజనం పొందిన కుటుంబాలను తిరిగి జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

### యూజీసీ నిబంధనలపైనా అభ్యంతరం

2026లో తీసుకొచ్చిన యూజీసీ కుల సమానత్వ నిబంధనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. విద్యా రంగంలో కుల ఆధారిత విధానాల స్థానంలో ప్రతిభ, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.అదే సమయంలో భర్తీ కాని రిజర్వ్‌డ్ ఖాళీలను డీ–రిజర్వ్ చేయాలని.. పోటీ పరీక్షల్లో కనీస అర్హత మార్కులను తప్పనిసరి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### రిజర్వేషన్లకు కాలపరిమితి పెట్టాలా?

రిజర్వేషన్ వ్యవస్థకు నిర్దిష్ట కాల పరిమితి విధించాలని కూడా ఆందోళనకారులు కోరుతున్నారు. 'సన్‌సెట్ క్లాజ్' తీసుకురావాలని.. నిర్దిష్ట వ్యవధి తర్వాత రిజర్వేషన్ ప్రయోజనాలు అవసరమా లేదా అనే అంశాన్ని సమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.లబ్ధిదారుల జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించి.. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన వర్గాలను రిజర్వేషన్ పరిధి నుంచి తొలగించాలని వారు కోరుతున్నారు.

### బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ప్రతిఘటన?

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఈ ఉద్యమం తీవ్రతరం అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి కూడా భారీ ప్రతిఘటన వచ్చే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. రాజ్యాంగం కల్పించిన సామాజిక భద్రత, చారిత్రకంగా ఎదుర్కొన్న అసమానతలను అధిగమించేందుకు రిజర్వేషన్లు అవసరమని ఆయా వర్గాలు భావిస్తున్నాయి.రిజర్వేషన్లను కేవలం ఆర్థిక ప్రాతిపదికకు పరిమితం చేయాలన్న డిమాండ్‌ను సామాజిక వెనుకబాటుతనాన్ని విస్మరించే ప్రయత్నంగా ఆయా వర్గాలు అభివర్ణించే అవకాశం ఉంది. దీంతో ఈ అంశం భవిష్యత్తులో మరింత పెద్ద సామాజిక, రాజకీయ చర్చకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

### కేంద్రానికి రాజకీయ పరీక్ష?

ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన ఈ నిరసన దేశవ్యాప్తంగా విస్తరిస్తే కేంద్ర ప్రభుత్వానికి రాజకీయంగా సవాలుగా మారే అవకాశం ఉంది. ఒకవైపు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వర్గాల డిమాండ్లు.. మరోవైపు రిజర్వేషన్లను సామాజిక న్యాయానికి కీలక సాధనంగా భావిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభిప్రాయాలు.. కేంద్రానికి సంక్లిష్ట పరిస్థితిని తీసుకురావచ్చు.మొత్తంగా.. రిజర్వేషన్ల వ్యవస్థలో సమూల మార్పులు కోరుతూ ఢిల్లీలో మొదలైన నిరసన రాజకీయంగా, సామాజికంగా కొత్త చర్చకు తెరలేపింది. కులం ఆధారంగా కాకుండా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్ ఎంతవరకు ముందుకు వెళ్తుంది? దీనిపై కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది? బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఎలాంటి ప్రతిస్పందన వస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మీర్‌పేట్‌లో దారుణం.. డబ్బు, బంగారం కోసం మహిళ హత్య

**ప్రజావాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సంపులో మహిళ మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతురాలిని కమలమ్మగా పోలీసులు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు హత్య కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు.

### డబ్బు.. బంగారం కోసమే హత్య?

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శ్రీకృష్ణ హాట్‌చిప్స్ యజమాని ప్రకాష్.. నగదు, బంగారు కమ్మల కోసం కమలమ్మను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు సమాచారం. కమలమ్మ వద్ద ఉన్న రూ.10 వేల నగదు, అర తులం బంగారు కమ్మలను దోచుకునేందుకే ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

### షాపులోకి వెళ్లిన కమలమ్మ.. తిరిగి రాలేదు

కమలమ్మ జీతం తీసుకుని ఇంటికి వెళ్తుండగా ప్రకాష్ ఆమెను తన షాపులోకి పిలిచినట్లు పోలీసులు గుర్తించారు. కమలమ్మ షాపులోకి వెళ్లిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అయితే షాపులోకి వెళ్లిన తర్వాత ఆమె బయటకు రాకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది.దీంతో పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించడంతో పాటు దర్యాప్తును ముమ్మరం చేశారు. కమలమ్మ చివరిసారిగా ఎక్కడికి వెళ్లింది? ఎవరిని కలిసింది? అనే కోణాల్లో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ప్రకాష్‌పై అనుమానం బలపడినట్లు తెలుస్తోంది.

### సీసీ ఫుటేజీతో బయటపడిన నిజం

కమలమ్మ షాపులోకి వెళ్లిన దృశ్యాలు పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారాయి. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు కేసును ముందుకు తీసుకెళ్లారు. విచారణలో ప్రకాష్ హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.కమలమ్మను హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని సంపులో పడేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. దీంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.

### ఆర్థిక ఇబ్బందులే కారణమా?

ప్రకాష్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతోనే కమలమ్మ వద్ద ఉన్న నగదు, బంగారంపై కన్నేసినట్లు పోలీసులు చెబుతున్నారు. కేవలం రూ.10 వేల నగదు, అర తులం బంగారు కమ్మల కోసం ఓ మహిళను హత్య చేయడం స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది.ఈ ఘటనతో మీర్‌పేట్ పరిధిలో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది. డబ్బు, బంగారం కోసం ఇంతటి దారుణానికి పాల్పడటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పోలీసుల దర్యాప్తులో మరిన్ని వివరాలు?

ప్రస్తుతం నిందితుడు ప్రకాష్‌ను పోలీసులు అరెస్ట్ చేసి పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. హత్యకు ముందు, అనంతరం జరిగిన పరిణామాలు.. మృతదేహాన్ని సంపులోకి ఎలా తరలించారు? ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా? అనే కోణాల్లో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.మొత్తంగా.. రూ.10 వేల నగదు, అర తులం బంగారం కోసం కమలమ్మ హత్యకు గురికావడం మీర్‌పేట్‌లో కలకలం రేపింది. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంతో ఈ దారుణ హత్య వెనుక అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

# బీసీలకు ఒక న్యాయం.. రెడ్లకు మరో న్యాయం కాదు..

మొదటి పేజీ తరువాయి

కమిటీ సుమోటోగా స్వీకరించే అవకాశం ఉందని మల్లు
రవి స్పష్టం చేశారు. దీంతో రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యల వ్యవహారం కూడా భవిష్యత్‌లో పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది.

### కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అంశం హాట్ టాపిక్

కొండా సురేఖ వ్యవహారం, సుస్మిత వ్యాఖ్యలు, రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్‌లో పార్టీ క్రమశిక్షణ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సొంత పార్టీ నేతలు ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై బహిరంగ వ్యాఖ్యలు చేయడం పార్టీకి ఇబ్బందికరంగా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మొత్తంగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని మల్లు రవి చేసిన వ్యాఖ్యలు.. కొండా సురేఖ వ్యవహారంలో క్రమశిక్షణ కమిటీ వైఖరిపై మరింత స్పష్టత ఇచ్చాయి. సురేఖ వివరణపై పార్టీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? సుస్మిత వ్యాఖ్యలపై తదుపరి చర్యలు ఉంటాయా? రాజగోపాల్ రెడ్డి వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీ ఎప్పుడు సుమోటోగా స్వీకరిస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఏడంతస్తుల భవనం కుప్పకూలింది

మొదటి పేజీ తరువాయి

వ్యక్తి చేపట్టినట్లు సమాచారం. ఈ నిర్మాణంపై పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. భవనం అత్యంత ప్రమాదకర స్థాయిలో నిర్మిస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్మాణం కొనసాగిందని వారు ఆరోపిస్తున్నారు.అంతేకాదు.. క్షేత్రస్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులు ఇచ్చి నిర్మాణాన్ని కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది. ప్రమాదం తర్వాత ఈ ఆరోపణలు మరింత చర్చనీయాంశంగా మారాయి.

### అంజయ్య నగర్‌లో గతంలోనూ ప్రమాదమే..

అంజయ్య నగర్‌లో ఇలాంటి ప్రమాదకర నిర్మాణం జరగడం ఇదే మొదటిసారి కాదని స్థానికులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఐదంతస్తుల భవనం పక్కకు ఒరిగిన ఘటన చోటుచేసుకుంది. అప్పట్లోనే అక్రమ, ప్రమాదకర నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న డిమాండ్లు వచ్చాయి.అయితే తాజాగా మరో ఏడంతస్తుల భవనం కుప్పకూలడంతో.. గత ఘటన నుంచి అధికారులు ఎలాంటి గుణపాఠం నేర్చుకున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలో వేగంగా పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



### శిథిలాల కింద మరెవరైనా ఉన్నారా?

రీజినల్ ఫైర్ ఆఫీసర్ సుధాకర్ రావు ఘటనపై స్పందిస్తూ.. భవనం కుప్పకూలిన సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నామని తెలిపారు. విక్టిమ్ లొకేషన్ సిస్టమ్ ద్వారా శిథిలాల కింద రెండు మృతదేహాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు.ఆ రెండు మృతదేహాలను శిథిలాల నుంచి వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఇంకా శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా అనే విషయాన్ని నిర్ధారించేందుకు తనిఖీలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఉదయం భవనంలో పనిచేయడానికి ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు స్థానికులు చెప్పారని సుధాకర్ రావు పేర్కొన్నారు.

### అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎప్పుడు?

గచ్చిబౌలి వంటి అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతంలో అనుమతులు లేకుండా ఏడంతస్తుల భవనం నిర్మాణం చేపట్టడం ఇప్పుడు అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. గతంలోనే నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణం ఎలా కొనసాగింది? ఫిర్యాదులు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు.. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రమాదం తర్వాతే చర్యలా?

భవనం కూలిన తర్వాత హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. కానీ ఇలాంటి ప్రమాదాలు జరగకముందే ప్రమాదకర నిర్మాణాలను గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఒక చిన్న స్థలంలో భారీ భవనం నిర్మించడం.. గతంలోనే నోటీసులు రావడం.. స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయడం.. చివరకు అదే భవనం కుప్పకూలి ఇద్దరి ప్రాణాలు పోవడం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిగితేనే అక్రమ నిర్మాణం వెనుక ఉన్న అసలు కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.మొత్తంగా.. గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నగరంలోని అక్రమ నిర్మాణాలపై మరోసారి తీవ్ర చర్చకు తెరలేపింది. ఇద్దరి ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన తర్వాత అయినా అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారా? అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేస్తారా? నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు ఉంటాయా? అన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# లండన్‌లో సీఎం రేవంత్.. తెలంగాణకు అంతర్జాతీయ భాగస్వామ్యాలు

మొదటి పేజీ తరువాయి

అక్టోబర్‌లో హైదరాబాద్‌కు రానుంది. ఆ పర్యటనలో తెలంగాణ–లివర్‌పూల్ మధ్య అధికారిక ఒప్పందం చేసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### ఇంపీరియల్ కాలేజీతో విద్యా భాగస్వామ్యం

మరోవైపు లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీతో కూడా తెలంగాణ భాగస్వామ్యంపై చర్చలు జరిగినట్లు సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు తెలిపారు. ఇంపీరియల్ కాలేజీని సందర్శించిన తెలంగాణ ప్రతినిధులు.. అక్కడి ప్రతినిధులతో విద్యా సహకార అవకాశాలపై చర్చించారు.తెలంగాణలో షార్ట్‌టర్మ్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు అందించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రామకృష్ణారావు తెలిపారు. పరిశోధనతో పాటు విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడిపై కూడా ఇంపీరియల్ కాలేజీ ఆసక్తి చూపుతోందని వెల్లడించారు.

### ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు ఆహ్వానం

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను ఆహ్వానించినట్లు రామకృష్ణారావు తెలిపారు. STEM, బిజినెస్ విద్యలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థగా ఉన్న ఇంపీరియల్ కాలేజీతో భాగస్వామ్యం తెలంగాణకు ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తెలంగాణను అభివృద్ధి చేయడంలో భాగంగా ఇలాంటి సంస్థలతో భాగస్వామ్యాలు కీలకంగా మారనున్నాయి. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా కార్యక్రమాలకు కొత్త అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు రామకృష్ణారావు పేర్కొన్నారు.

### విద్య.. క్రీడలు.. టెక్నాలజీపై ఫోకస్

సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటనలో వరుసగా జరుగుతున్న సమావేశాలు తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులు, విద్యా సంస్థలు, క్రీడా సంస్థలతో అనుసంధానం చేసే దిశగా సాగుతున్నాయి. ఒకవైపు లివర్‌పూల్‌తో క్రీడలు, టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో భాగస్వామ్యానికి ప్రయత్నిస్తుండగా.. మరోవైపు ఇంపీరియల్ కాలేజీతో విద్య, పరిశోధన రంగాల్లో సహకారానికి మార్గం సుగమం అవుతోంది.

### హైదరాబాద్‌పై అంతర్జాతీయ దృష్టి?

తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టడం ద్వారా హైదరాబాద్‌ను పెట్టుబడులు, విద్య, క్రీడలు, టెక్నాలజీకి మరింత కీలక కేంద్రంగా మార్చే ప్రయత్నాలు చేస్తోంది. లివర్‌పూల్ ప్రతినిధుల హైదరాబాద్ పర్యటన, ఇంపీరియల్ కాలేజీతో విద్యా సహకార చర్చలు ఈ దిశలో కీలకంగా మారే అవకాశం ఉంది.మొత్తంగా.. సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటనలో తెలంగాణకు అంతర్జాతీయ భాగస్వామ్యాలను తీసుకురావడంపై దృష్టి సారించారు. అక్టోబర్‌లో లివర్‌పూల్ ప్రతినిధుల హైదరాబాద్ పర్యటన, డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో ఈ చర్చలు ఏ మేరకు అధికారిక ఒప్పందాలుగా మారతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# స్కూల్‌లోకి దూసుకెళ్లిన సీజేపీ నేత.. అభిజిత్ దిప్కేపై కేసు

**ప్రజావాయిస్, మహారాష్ట్ర :** కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కేపై మహారాష్ట్రలో కేసు నమోదైంది. లాటూర్ జిల్లాలోని ఔసా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రభుత్వ పాఠశాలలోకి అనుమతి లేకుండా ప్రవేశించి.. ఉపాధ్యాయులను బెదిరించారన్న ఆరోపణలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జిల్లా పరిషత్ ఉర్దూ టీచర్ సయ్యద్ శంశద్ బానో ఖైరత్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది.

### 'స్కూల్ తీక్ ఖరో' కార్యక్రమంలో భాగంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలనే డిమాండ్‌తో సీజేపీ ఆధ్వర్యంలో లాటూర్ జిల్లావ్యాప్తంగా 'స్కూల్ తీక్ ఖరో' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అభిజిత్ దిప్కే పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తున్నారు.ఔసాలోని జెడ్పీ ఉర్దూ పాఠశాలలోకి కూడా దిప్కేతో పాటు పలువురు నిరసనకారులు అనుమతి లేకుండా ప్రవేశించారని స్కూల్ యాజమాన్యం ఆరోపించింది. విద్యార్థుల మధ్య కూర్చుని వారికి ఇబ్బంది కలిగించేలా ప్రశ్నలు అడిగారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### తరగతులకు అంతరాయం కలిగించారన్న ఆరోపణలు

పాఠశాలలోకి ప్రవేశించిన అనంతరం తరగతులకు అంతరాయం కలిగించారని స్కూల్ యాజమాన్యం ఆరోపించింది. మరో పాఠశాల విద్యార్థులను తీసుకొచ్చి తమ పాఠశాలలో కూర్చోబెట్టారని కూడా ఫిర్యాదులో పేర్కొంది.ఉపాధ్యాయులను సస్పెండ్ చేయిస్తానని బెదిరించినట్లు కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు అభిజిత్ దిప్కేపై భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని 132, 329(3), 351(2), 356(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

### పాఠశాలల్లో వసతుల కోసం నిరసనలు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మెరుగైన విద్యా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు.అయితే ప్రభుత్వ పాఠశాలల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించడం, తరగతులకు అంతరాయం కలిగించడం, ఉపాధ్యాయులను బెదిరించడం వంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని



పాఠశాల యాజమాన్యం ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### ఇటీవల ఢిల్లీలోనూ సీజేపీ ఆందోళనలు

ఇటీవలి కాలంలో కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్తంగా పలు అంశాలపై ఆందోళనలు నిర్వహిస్తోంది. నీట్ పరీక్షలో అక్రమాలకు నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసనలు చేపట్టింది. ఈ ఆందోళనలు నెల రోజులకు పైగా కొనసాగాయి.వేలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని.. నీట్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఛలో పార్లమెంట్ మార్చ్‌కు కూడా పిలుపునిచ్చారు.
మహారాష్ట్ర కేసుతో సీజేపీకి మరో చిక్కు?ఢిల్లీలో నిరసనలతో జాతీయ స్థాయిలో చర్చకు వచ్చిన సీజేపీకి.. ఇప్పుడు మహారాష్ట్రలో నమోదైన కేసు కొత్త వివాదానికి కారణమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కోసం చేపట్టిన కార్యక్రమం వివాదాస్పదంగా మారడం, పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది.మొత్తంగా.. పాఠశాలలోకి అనుమతి లేకుండా ప్రవేశించి ఉపాధ్యాయులను బెదిరించారన్న ఆరోపణలపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కేపై కేసు నమోదైంది. బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద నమోదు చేసిన ఈ కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలుతాయా? లేక 'స్కూల్ తీక్ ఖరో' కార్యక్రమంలో భాగంగా జరిగిన చర్యలుగా పరిగణిస్తారా? అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# కొండా సురేఖకు అండగా నిలిచేదెవరు ?

మొదటి పేజీ తరువాయి

కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి శనివారం మరో లేఖ రాశారు. తనపై వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించి.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

### నోటీసుకు వివరణ ఇచ్చినా.. మళ్లీ టార్గెట్ ఎందుకు?

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ స్పష్టం చేశారు. అయితే ఆ వివరణపై కమిటీ విచారణ కొనసాగుతున్న సమయంలోనే కొంతమంది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు తనపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, తనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పరిశీలించాలని కోరారు.క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయాన్ని ప్రభావితం చేసేలా ఏమైనా ప్రయత్నాలు జరుగుతున్నాయా అనే అంశాన్ని పరిశీలించాలని తన లేఖలో సురేఖ ప్రస్తావించారు. అంటే.. తనపై జరుగుతున్న విమర్శలు కేవలం వ్యక్తిగత వ్యాఖ్యలేనా.. లేక వాటి వెనుక మరేదైనా రాజకీయ వ్యూహం ఉందా అన్న అనుమానాన్ని ఆమె వ్యక్తం చేసినట్టుగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### నా కుటుంబాన్ని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?

కొండా సురేఖ లేఖలో ప్రధానంగా తన కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్న అంశాన్ని ప్రస్తావించారు. తనను మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులను కూడా రాజకీయ వివాదంలోకి లాగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన పట్ల అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్న నేతల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలని ఆమె కోరడం ఇప్పుడు కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.ఒకవైపు క్రమశిక్షణ కమిటీ విచారణ కొనసాగుతుండగా.. మరోవైపు పార్టీ నేతలే తనపై బహిరంగ వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నది సురేఖ వాదన. పార్టీ అంతర్గత వ్యవహారాన్ని పార్టీ వేదికపైనే పరిష్కరించాల్సిన సమయంలో బహిరంగ విమర్శలు చేయడం వెనుక ఉద్దేశమేంటన్న ప్రశ్నను ఆమె లేవనెత్తారు.

### బీసీ మహిళా నాయకురాలిని టార్గెట్ చేస్తున్నారా?

తనను బీసీ మహిళా నాయకురాలిగా, సీనియర్ నేతగా టార్గెట్ చేస్తున్నా పార్టీ మౌనం వహించడం ఆందోళనకరమని కొండా సురేఖ పేర్కొన్నారు. పార్టీలో తనపై ఒక విధమైన ఒత్తిడి వాతావరణం సృష్టిస్తున్నారన్న భావనను ఆమె లేఖ ద్వారా వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.ఇది కేవలం ఒక నేతపై వచ్చిన విమర్శల వ్యవహారంగా కాకుండా.. పార్టీలో అంతర్గతంగా కొనసాగుతున్న వర్గ విభేదాలకు మరో రూపంగా మారుతోందా అన్న చర్చ కూడా మొదలైంది. ఇప్పటికే చిన్నారెడ్డి, కొండా సురేఖ ఎపిసోడ్‌తో కాంగ్రెస్‌లో విభేదాలు బహిర్గతమైన నేపథ్యంలో తాజా లేఖ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

### మల్లు రవి ఏమన్నారు?

మరోవైపు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన తెలిపారు. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని సూచించారు.సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ చెబుతున్నప్పటికీ.. ఆమె వివరణపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడే చెప్పలేమని మల్లు రవి స్పష్టం చేశారు. చిన్నారెడ్డి వివరణను కూడా క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

### కొండా ఫ్యామిలీ ఎపిసోడ్‌లో అసలు ట్విస్ట్ ఏంటి?

ఇప్పుడు కాంగ్రెస్‌లో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న ఇదే. కొండా కుటుంబానికి, పార్టీ నేతలకు మధ్య నెలకొన్న ఈ వివాదం ఎక్కడి వరకు వెళ్తుంది? క్రమశిక్షణ కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? కొండా సురేఖ తాజా లేఖపై పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.ఒకవైపు సురేఖ తనను, తన కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారని చెబుతుండగా.. మరోవైపు క్రమశిక్షణ కమిటీ మాత్రం సుస్మిత చేసిన వ్యాఖ్యల అంశాన్ని కూడా ప్రస్తావిస్తోంది. దీంతో ఈ వ్యవహారం వ్యక్తిగత వ్యాఖ్యల వివాదం నుంచి పార్టీ అంతర్గత రాజకీయాలకు మారుతోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### రేవంత్ రాక తర్వాత ఏం జరుగుతుంది?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో.. ఆయన తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత ఈ వ్యవహారంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పార్టీ అంతర్గత విభేదాలకు ముగింపు పలికేలా నాయకత్వం జోక్యం చేసుకుంటుందా? లేక క్రమశిక్షణ కమిటీ తన ప్రక్రియను కొనసాగిస్తుందా? అన్నది చూడాల్సి ఉంది.తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పటికే పలు అంశాలపై నేతల మధ్య విభేదాలు బయటపడుతున్న సమయంలో.. కొండా సురేఖ రాసిన తాజా లేఖ ఆ పార్టీలో మరోసారి కలకలం రేపింది. తనపై జరుగుతున్న విమర్శల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలని ఆమె కోరడం.. ఈ వివాదం వెనుక మరింత పెద్ద రాజకీయ కథ ఉందన్న చర్చకు కారణమవుతోంది.మొత్తంగా.. కొండా సురేఖ లేఖతో తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం ఏంటి? పార్టీ అధిష్ఠానం ఎలా స్పందిస్తుంది? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక తర్వాత పరిస్థితులు ఎలా మారతాయి? అన్నదే ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# కాంగ్రెస్ ఇంటింటికీ.. బీఆర్ఎస్ రోడ్లపైకి.. బీజేపీ ఎక్కడ

- పథకాలతో కాంగ్రెస్ జోరు.. పోరాటాలతో బీఆర్ఎస్ బిజీ బిజీ.. మౌనంలో బీజేపీ
- ఉమ్మడి నల్గొండ జిల్లాలో మూడు పార్టీలకు మూడు రాజకీయ దారులు
- అధికారంలో కాంగ్రెస్.. అభివృద్ధి, సంక్షేమమే అజెండా
- ప్రతిపక్షంలో బీఆర్ఎస్.. ధర్నాలు, రాస్తారోకోలతో ప్రభుత్వంపై ఒత్తిడి
- ప్రజా సమస్యలపై బీజేపీ గళం ఎక్కడ
- కేడర్‌లోనూ చర్చవచ్చే రాజకీయ పోరుకు ఇప్పటి నుంచే ఎవరి వ్యూహం వారిదే
- ప్రజల వద్దకు చేరడంలో ఎవరి రాజకీయ పంథా ఫలిస్తుందో చూడాలి

**ప్రజా వాయిస్,ఉమ్మడి నల్గొండ బ్యూరో.**ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం మూడు విభిన్న దారుల్లో సాగుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఒకవైపు ప్రభుత్వ విధి విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ప్రధానంగా దృష్టి పెడుతుండగా, మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేపడుతూ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచే వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఈ రెండు పార్టీల మధ్య ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు, నిరంతర రాజకీయ కార్యక్రమాల విషయంలో బీజేపీ మాత్రం అంతగా కనిపించడం లేదనే చర్చ జిల్లా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన రాజకీయ అస్త్రంగా మలుచుకుంటోంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూత, రహదారులు, తాగునీరు, విద్యా రంగ అభివృద్ధి వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. నల్గొండలో ఇటీవల జరిగిన ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టుల పూర్తి, తాగునీటి పథకాలు, రోడ్ల నిర్మాణం వంటి భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను కూడా కాంగ్రెస్ నేతలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వమే దిశానిర్దేశం చేస్తోందనే సందేశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.

అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం పూర్తిగా మరో రాజకీయ ట్రాక్‌లో నడుస్తోంది. రైతుల సమస్యలు, ఎరువుల పంపిణీ, నీటిపారుదల, పెండింగ్ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ హామీల అమలు వంటి అంశాలను తీసుకుని రోడ్డెక్కుతోంది. నల్గొండలో రైతు సమస్యలపై నిరసనల నుంచి, ఇటీవల కల్యాణ లక్ష్మి–షాదీముబారక్ అంశంపై కలెక్టరేట్ వద్ద ధర్నాల వరకు బీఆర్ఎస్ తన పోరాట రాజకీయాన్ని కొనసాగిస్తోంది. ప్రభుత్వంపై విమర్శలు చేయడమే కాకుండా, ప్రజా సమస్యలను నేరుగా ఉద్యమ రూపంలోకి తీసుకెళ్లడం ద్వారా కేడర్‌ను కదిలించే ప్రయత్నం చేస్తోంది.

ఇక్కడే అసలు రాజకీయ వ్యత్యాసం స్పష్టమవుతోంది. కాంగ్రెస్ చెబుతున్నది—"ప్రభుత్వం చేస్తున్న పనులను చూడండి, సంక్షేమ ఫలాలు పొందండి" అని. బీఆర్ఎస్ చెబుతున్నది..ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదు, సమస్యలపై పోరాడాలి అని. కానీ ఈ రెండు రాజకీయ శబ్దాల మధ్య బీజేపీ మాత్రం జిల్లా స్థాయిలో ప్రజా సమస్యలపై ఎంతవరకు నిరంతర ఉద్యమ రాజకీయాన్ని నడుపుతోంది అన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న బీజేపీ, ఉమ్మడి నల్గొండ జిల్లాలో మాత్రం ప్రతి ప్రజా సమస్యపై ధర్నాలు, రాస్తారోకోలు, భారీ పోరాటాలతో నిరంతరం కనిపించడం లేదనే విమర్శలు రాజకీయ వర్గాల్లో ఉన్నాయి.

వాస్తవానికి ఉమ్మడి నల్గొండ జిల్లా అంటే కేవలం ఎన్నికల సమయంలో గుర్తుకొచ్చే రాజకీయ భూభాగం కాదు. సాగునీరు, ఎరువులు, రైతు సమస్యలు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల సమస్యలు, నిరుద్యోగం, పెండింగ్ అభివృద్ధి పనులు, రహదారులు, తాగునీరు, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక అంశాలు ప్రజల ముందున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అధికార పార్టీ పథకాలను చెప్పడం సహజమే. ప్రతిపక్షం వాటి అమలుపై ప్రశ్నించడం కూడా సహజమే. కానీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని భావించే బీజేపీ క్షేత్రస్థాయి ప్రజా ఉద్యమాల్లో మరింత బలంగా కనిపించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇటీవల బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి. ప్రజా సమస్యను రాజకీయ అజెండాగా మార్చి, దాన్ని ఉద్యమంగా తీర్చిదిద్దితేనే క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌కు నిరంతర పని దొరుకుతుందని ఆ పార్టీ భావిస్తోంది. నల్గొండలో ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సభలు జరిగినప్పుడు కూడా బీఆర్ఎస్ నిరసనలకు సిద్ధమవడం, స్థానిక సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆ వ్యూహంలో భాగంగానే కనిపిస్తోంది.

కాంగ్రెస్ మాత్రం ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ పనులను ప్రజల వద్దకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు సంక్షేమ పథకాల లబ్ధిదారులను చేరుకోవడం, మరోవైపు కొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం, ఇంకోవైపు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం ద్వారా అధికార పార్టీగా తన రాజకీయ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. భువనగిరిలో జరిగిన పార్టీ రాజకీయ వ్యవహారాల సమావేశంలో కూడా సంక్షేమం, ఆహార భద్రత, పేదల హక్కులను పార్టీ అజెండాతో ముడిపెట్టడం కాంగ్రెస్ ప్రస్తుత రాజకీయ దిశను సూచిస్తోంది.

మొత్తంగా ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు ఆసక్తికరమైన త్రిముఖ పోరు కనిపిస్తోంది. కాంగ్రెస్‌కు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ప్రచారం ప్రధాన ఆయుధంగా మారగా, బీఆర్ఎస్‌కు ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం ప్రధాన రాజకీయ మార్గంగా కనిపిస్తోంది. బీజేపీ మాత్రం ఈ రెండు పార్టీల మధ్య తన రాజకీయ స్థలాన్ని విస్తరించుకోవాలంటే విమర్శలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి ప్రజా సమస్యలపై మరింత స్పష్టమైన, నిరంతర ఉద్యమ కార్యాచరణతో ముందుకు రావాల్సిన పరిస్థితి ఉంది.

రాబోయే రోజుల్లో ప్రజలు కూడా మూడు పార్టీలను మూడు కోణాల్లో అంచనా వేసే అవకాశం ఉంది..ఎవరు పథకాలు ఇస్తున్నారు..ఎవరు సమస్యలపై పోరాడుతున్నారు..ఎవరు ప్రజల మధ్య నిరంతరం కనిపిస్తున్నారు..అన్న ప్రశ్నలకే ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాల్లో రాబోయే రోజుల్లో సమాధానం దొరకనుంది. పథకాలతో కాంగ్రెస్, పోరాటాలతో బీఆర్ఎస్, మౌనాన్ని వీడి ఉద్యమ రాజకీయాల్లోకి బీజేపీ ఎంత వేగంగా వస్తుందన్నదే ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారుతోంది.

## ప్రజా వాయిస్ ఎఫెక్ట్

- చేపల చెరువుల కాల్వను పూడ్చివేసిన అధికారులు
- ఇరిగేషన్ శాఖ అధికారులు నివేదికతో జిల్లా కలెక్టర్ ఆదేశాలు
- చేపల చెరువు యజమానిపై అక్రమ విద్యుత్తు వాడకం పై చర్యలు...?


**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** చెరువు శిఖం భూమిలో చేపల చెరువుల తవ్వకాలు.... పట్టించుకోని అధికారులు అనే శీర్షికతో ప్రజా వాయిస్ దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ స్పందించారు. ఈ మేరకు కన్ సాన్ పల్లి– గడి పెద్దపూర్ గ్రామాల మధ్య ఉన్న పెద్ద చెరువు శిఖం భూమిని ఆక్రమించుకొని దర్జాగా చేపల చెరువులు తవ్వకాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సుమారు రెండు కిలోమీటర్ల దూరం నుంచి చెరువులో ఉన్న నీటిని చేపల చెరువులకు తరలించేందుకు పెద్ద కాలువను తవ్వారు. ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది ప్రజా వాయిస్. దీంతో కలెక్టర్ ఇరిగేషన్ శాఖ అధికారులను విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గురువారం అధికారులు చేపల చెరువుకు సంబంధించిన శిఖం భూమి ఆక్రమనాపై నివేదికను కలెక్టర్కు ఇచ్చిన వెంటనే చేపల చెరువుకు సంబంధించిన కాలువను పూర్తిగా పూడ్చి వేయాలని ఆదేశించారు. చెరువులోని ఉన్న నీరు కేవలం వ్యవసాయానికి తప్ప ఎలాంటి ప్రైవేట్ పనులకు వినియోగించవద్దని దీనిపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఇరిగేషన్ శాఖ అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. దీంతో కాలువలను పూడ్చి వేసేందుకు కనీసం రెండు మూడు రోజులు సమయం పడుతుందని... కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువులో నుంచి తవ్విన కాలువను పూర్తిగా పూడ్చివేస్తామని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. ఇది ఇలా ఉంటే చేపల చెరువుకు అక్రమంగా విద్యుత్తు వాడుతున్నట్లు ఆరోపణలు రావడంతో దానిపై విచారణ జరిపి చేపల చెరువు యజమానిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్ ను కొరడంతో విద్యుత్ శాఖ అధికారులకు విచారణ జరపాలని ఆదేశించారు. ఇబ్బందులకు విరుద్ధంగా అక్రమ విద్యుత్తు వినియోగిస్తే అతనిపై శాఖ పరంగా చర్యలు తీసుకొని పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని ఆదేశించారు.



## నిధులు బొక్కేశారు... పంచాయతీని నొక్కేశారు!

- కలెక్టర్‌కు విన్నవించినా కరగని నిర్లక్ష్యం!
- ఖమ్మంపల్లిలో ఫోరం లేకుండానే తీర్మానాలు
- గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు
- పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు
- ఎనిమిది నెలలుగా అధికారులు స్పందించకపోవడం
- రాజకీయ పలుకుబడి ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం
- గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

**ప్రజా వాయిస్ ముత్తారం** జిల్లాలోని ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన భారీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసినా ఎనిమిది నెలలుగా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రాజకీయ పలుకుబడి ఉన్నవారికే అధికారులు వత్తాసు పలుకుతున్నారని, తమ సమస్యలను పరిష్కరించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి... ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీలో 2024 ఫిబ్రవరి 2 నుండి 2025 డిసెంబర్ 21 వరకు జనరల్ ఫండ్స్, సెంట్రల్ ఫండ్స్, స్టేట్ ఫండ్స్, టీఎస్ బిపాస్ మరియు వసూలు చేసిన ఇంటి పన్నులు, ఎన్నికల సమయంలో సర్పంచ్ మరియు వార్డు సభ్యుల నామినేషన్ రుసుము ద్వారా వచ్చిన డబ్బులు దుర్వినియోగం అయ్యాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నామినేషన్ ఫీజు, గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని రకాల నిధులు పంచాయతీ కార్యదర్శి దుర్వినియోగం చేశారని వారు ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా, గ్రామపంచాయతీకి సంబంధించిన గ్రామసభలు ఫోరం లేకుండానే తీర్మానాలు ఆమోదించారని, గృహనిర్మాణానికి సంబంధించిన నిధులు గ్రామపంచాయతీకి రాకుండా దుర్వినియోగం చేశారని వారు పేర్కొంటున్నారు. ఈ సమస్యలపై గ్రామ మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ 2025 డిసెంబర్ 22న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన చెక్కులపై, ఇచ్చిన తీర్మానాలపై, ఇంటి నిర్మాణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పంచాయతీ రాజ్ చట్టం – 2018 ప్రకారం మరియు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



తేది :22-12-2025

శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్
పెద్దపల్లి గారికి సమర్పించిన వ్రాయునది.

ఇట్లు
మీ విధేయుడు
(సముద్రాల రమేష్)
మాజీ సర్పంచ్
గ్రా॥ఖమ్మంపల్లి, మం॥ముత్తారం,
జిల్లా పెద్దపల్లి, సెల్ : 9948481062.

22 DEC 2025

### అధికారుల నిర్లక్ష్యం

కానీ, ఎనిమిది నెలలు గడిచినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రాజకీయ పలుకుబడి ఉన్నవారే చట్టాలను ఉల్లంఘిస్తున్నారని, సామాన్య ప్రజలకు చట్టం వర్తించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అధికారులు పెద్దపల్లి కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదును పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

## పెన్షన్ దరఖాస్తులకు ఆగస్టు 31 చివరి తేదీ

- అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి
- ఎంపీడీవో క్రాంతికుమార్
- వికలాంగులు ఈ నెల 26న మెదక్‌లో సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** సామాజిక భద్రతా పెన్షన్‌కు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులు ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో క్రాంతికుమార్ సూచించారు. అర్హులైన వారు తమ గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.వికలాంగుల ధ్రువీకరణ పత్రం లేని అర్హులు ఈ నెల 26న మెదక్‌లో నిర్వహించే సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ గడువు ముగిసేలోపు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.




## ఉద్దెమర్రి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

**శామీర్ పేట / ప్రజా వాయిస్ :** ఉద్దెమర్రి శ్రీ విష్ణు శ్రీశివాయ శ్రీవెంకటేశ్వర స్వామి (అక్కన్న మాదన్న) దేవాలయం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా శనివారం ఉద్దెమర్రి శ్రీ విష్ణు శివాలయం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఔషాపూర్ గ్రామ నివాసులు సూరి వెంకట సత్య ప్రసాద్ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.... అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని, భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించిన సూరి వెంకట సత్య ప్రసాద్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వారి ఆశీస్సులు సూరి వెంకట సత్య ప్రసాద్ దంపతులు, వారి కుటుంబ సభ్యులపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## కలెక్టర్ గారు ఆత్మకూరు మండలం వైపు చూడండి

- ప్రజావాణి దరఖాస్తులు లెక్క చేయని మండల అధికారులు
- ప్రభుత్వ భూమికి పట్టా పాస్ బుక్కులు ఇచ్చిన వైనం వాగులు చెరువు భూములు అన్యకాంతం.
- దళారి వ్యవస్థను కొనసాగిస్తున్న రెవెన్యూ అధికారులు?
- ప్రతి పనికో రేటు చెయ్యి తడపందే ఇక్కడ పనులు జరగవు..?
- లబ్ధిదారులు ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- ఎమ్మెల్యే పేరును గట్టిగానే వాడుకుంటున్న రెవిన్యూ అధికారులు




ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి బంతిలో కూర్చున్నప్పుడు వడ్డించే వాడు మనవాడు అయినప్పుడు ఏ మూలకు కూర్చున్న మాంసం ముక్క పడదా అన్న చందంగా రెవెన్యూ అధికారుల పనితీరును దుయ్యబడుతున్న మండల ప్రజలు. హనుమకొండ జిల్లా కలెక్టర్ గారు ఆత్మకూరు మండలాన్ని ఒక్కసారి సందర్శించి అధికారుల పనితీరు.. అధికారులు తీసుకుంటున్న జీతాలకు పని చేసే పనికి పొంతనే లేదని.. లబ్ధిదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం రాచరికం పాలన. కొనసాగుతుందని. రెవెన్యూ అధికారుల చేతులకు మన్ను అంటకుండా ఈ మధ్య అవినీతి నిరోధక శాఖ అధికారులు ఏదో ఒక చోట అవినీతి అధికారులను పట్టుకోవడంతో. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండల రెవెన్యూ అధికారులు దళారులను ఏర్పాటు చేసుకొని పట్టా పాస్ పుస్తకాలు. భూమి సర్వే నంబర్లు తప్పు పడటంతో తాసిల్దార్.రెవెన్యూ ఇన్స్పెక్టర్.సర్వేర్ లను ఆశ్రయించడం అధికారులు వాయిదాల మీద వాయిదాలు పెట్టడం రైతులు లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరగడం పరిపాటిగా కొన్ని ఏళ్ల నుండి కొనసాగుతుంది. పట్టాదారుని ప్రమేయం లేకుండా కాస్టులో ఉన్న వ్యక్తి మరో వ్యక్తికి భూమి విక్రయాలు చేస్తే పట్టాదారుని సంతకం లేకుండా రిజిస్ట్రేషన్ ఎలా అయితుందని ప్రశ్నిస్తున్న బాధితుడు? ప్రభుత్వ భూమికి పట్టా పాస్ బుక్కులు ఇచ్చిన తహసిల్దార్లు. సమాచార హక్కు చట్టం ఇక్కడ పనిచేయదు. పని తక్కువ ఆరు బాటలు ఎక్కువ.. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసుకున్న దళాలను ఆశ్రయించి వారు అడిగినంత డబ్బులు ఇస్తే పనులు చకచకా జరిగిపోతున్నాయి?. ఈ విషయం తెలియక లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరగడం ఉన్నతాధికారు లను ఆశ్రయించిన ఫలితం లేకపోవడం వారి బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిని ఆశ్రయించినప్పటికీ లబ్ధిదారులకు తెలియపరచకుండా తిరిగి సమస్యను పరిష్కరించకుండా వారికి దోచింది రాసి తిరిగి పంపించడం రెవెన్యూ అధికారులకు ఆనవాయితీగా కొనసాగుతుంది.. చెరువులు వాగులు అన్యకాంతానికి గురయ్యాయని రాత పూర్వకంగా తాసిల్దార్ కు దరఖాస్తులు ఇచ్చినప్పటికీ నేటి వరకు కన్నెత్తి చూసిన పాపన పోలేదని. స్థానిక కార్యాలయంలో పనులు జరగడం లేదని గోడును వెళ్లబుచ్చుకుంటున్న బాధితులు. ప్రతి పనికి రేటు అడిగినంత ఇస్తే ప్రభుత్వ నిబంధనలు ఈ కార్యాలయంలో వర్తించవు. సెప్టెంబర్ 12. 2026 వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ వీఆర్వోలను విధుల్లోకి తీసుకున్నారు. మండలంలోని ఓ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న విఆర్ఓ కు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు ఇవ్వాలని కలెక్టర్కు సిఫారసు చేసిన తాసిల్దార్ ఐదు నెలల్లో ఆ అధికారి ఏం పనులు చేశాడు.? మండల అధికారులు కొందరు ప్రతి పనిలో స్థానిక ఎమ్మెల్యే పేరును గట్టిగానే వాడుకుంటున్న రెవెన్యూ అధికారులు. ఏది ఏమైనాప్పటికి జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం. ఉన్నతాధికారుల మాటలను పెడచెవున పెట్టడం ఆత్మకూరు మండల రెవెన్యూ అధికారులకు ఇదేం కొత్తేం కాదని. సమయపాలన పాటించడంలో కూడా విఫలమయ్యారనే ఆరోపణలు ప్రజల నుండి బలంగా వినిపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ అవినీతి నిరోధక శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆత్మకూరు మండలం పై దృష్టి పెట్టాలని వేడుకుంటున్న మండల ప్రజలు.

## గుడుంబా, బెల్ట్‌షాపుల అడ్డాగా గోపాల్‌పూర్!

- మద్యం అమ్మకాల్లో మంథని మండలంలోనే నంబర్-1
- మహిళల్లో తీవ్ర ఆగ్రహం
- ఊళ్లో 12కి పైగా దందా కేంద్రాలు
- మండలంలో నాలుగు గ్రామ పంచాయతీలో బెల్ట్ లను నిషేధించడం జరిగింది
- ఆ ఊళ్లలాగే ఇక్కడా బంద్ పెట్టాల్సిందేనని డిమాండ్



**ప్రజా వాయిస్ మంథని** మండలంలోని గోపాల్‌పూర్ గ్రామం ఇప్పుడు నాటుసారా (గుడుంబా), అక్రమ బెల్ట్‌షాపుల అమ్మకాలతో తీవ్ర కలకలం రేపుతోంది. గుడుంబా విక్రయాల్లో ఈ ఊరు మండలంలోనే మొదటి వరుసలో ఉంది. దీనికి తోడు గ్రామంలో ఏకంగా 12కు పైగా బెల్ట్‌షాపులు వెలిశాయి. పొద్దున లేచింది మొదలు రాత్రి దాకా ఊళ్లో మందు, సారా ఏరులై పారుతోంది. తాగుబోతుల గొడవలతో ఇళ్లల్లో ప్రశాంతత లేకుండా పోతోందని, కాపురాలు కూలిపోతున్నాయని గ్రామ మహిళలు మండిపడుతున్నారు. ఇటీవలే మన మండలంలోని నాగారం, కన్నాల, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో ప్రజలంతా ఒకటై బెల్ట్‌షాపులను పూర్తిగా బంద్ చేయించారు. ఊరి పెద్దలతో కలిసి తీర్మానాలు కూడా చేసుకున్నారు. సరిగ్గా అదే బాటలో తమ గోపాల్‌పూర్ గ్రామంలో కూడా గుడుంబా, బెల్ట్‌షాపులు ఏవీ లేకుండా సంపూర్ణంగా బంద్ చేయాలని మహిళలు కోరుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు వెంటనే స్పందించి గోపాల్‌పూర్‌లో గుడుంబా తయారీపై దాడులు చేయాలని, బెల్ట్‌షాపులు మూయించి ఆ వ్యాపారం చేసే టోళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులైనా, ఊరి పెద్దలైనా చొరవ తీసుకోకపోతే ఊళ్లో బెల్ట్‌షాపులు, సారా బిజినెస్ బంద్ అయ్యేదాకా తాము ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.

# అభివృద్ధి చేసే ఓటు అడుగుతా

- మాటలతో కాదు.. పనులతోనే సమాధానం చెబుతా
- ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలి.. పచ్చదనాన్ని పెంచాలి
- త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం
- రూ.530 కోట్లతో నగరంలో శాశ్వత నీటి సమస్యకు పరిష్కారం
- కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత: ఎమ్మెల్యే నాయిని



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అభివృద్ధి పనులతోనే ప్రజల ముందుకు వెళ్తామని, పనులు చేసి ఓటు అడుగుతామని స్పష్టం చేశారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 49వ డివిజన్‌లో లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి GWMC కమిషనర్ వెంకన్న తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గతంలో ఒక డివిజన్‌కు రూ.50 లక్షలు కేటాయించడం గొప్పగా చెప్పుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఒక్కో డివిజన్‌కు రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని వివరించారు.శాయంపేట ప్రాంతానికి సుమారు రూ.20 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు.వరంగల్ నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకురావడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరిన మేరకు నగరానికి భారీ వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు మంజూరైందని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా డ్రైనేజీ పైప్‌లైన్లు, నీటి పైప్‌లైన్లు, సెంట్రల్ లైటింగ్ తదితర మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భారీ ప్రాజెక్టు కావడంతో పనులు పూర్తయ్యేందుకు కొంత సమయం పడుతుందని, అనంతరం నగరానికి శాశ్వతమైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని వివరించారు.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రస్తుతం కొత్తగా శాశ్వత రోడ్లు నిర్మించి, కొద్దికాలానికే వాటిని తవ్వాల్సిన పరిస్థితి రాకుండా ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.ఇప్పుడు రోడ్లు వేస్తే.. కొన్ని నెలల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం మళ్లీ తవ్వాల్సి వస్తుంది. ప్రజల డబ్బు వృథా కాకూడదు. ప్రాజెక్టు పూర్తయ్యాక రోడ్లు, డ్రైనేజీలు, పైప్‌లైన్లు అన్నీ సమగ్రంగా, అత్యాధునిక విధానంలో ఏర్పాటు చేస్తాం అని తెలిపారు.వరంగల్ నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.530 కోట్లతో చేపడుతున్న పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే తెలిపారు. నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ పాత కాలంలో నిర్మించిన నీటి నిల్వ వ్యవస్థలను ఆధునీకరించడంతో పాటు, అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీరు ప్రజలకు అత్యవసరమైన అంశమని, దీనికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీ పెద్దలు, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపుతామని .ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దాని బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.GWMC కమిషనర్ మాట్లాడుతూ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేందుకు నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం అభినందనీయమన్నారు. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను నాటడం సంతోషకరమన్నారు.మొక్కలను నాటి వదిలేయకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నగర అభివృద్ధిలో ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పక్కన గొంతు ఎత్తిన బీఆర్ఎస్!?

- జీవో నెంబర్ 97ను ఎత్తివేయాలంటూ నిరసనలు!
- ప్రధాన రహదారులు నిర్బంధం ధర్నాలు చేపట్టిన వైనం!
- నియోజకవర్గంలోని ప్రధాన నాయకులను అరెస్టులు ఆపై విడుదల
- పలు ప్రభుత్వ కార్యాలయంలో వినతి పత్రాలు సమర్పణ




**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ విద్యార్థులపై జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని పాలిటెక్నికల్ విద్యార్థులకు న్యాయం చేయాలంటూ మండలాల్లో విద్యార్థులు పక్కన గుంటెత్తి నిరసన కార్యక్రమాలను సైతం నిర్వహించింది అంతేకాకుండా పలు ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసే విధంగా ఆయా శాఖల ఉన్నతాధికారులకు వినతి పత్రాలను సైతం సమర్పించి విద్యార్థులు పక్షనా నిలబడి నిరసన కార్యక్రమాలు చేపట్టారు ఇటువంటి కార్యక్రమాల్లో రహదారులు నిర్బంధం తో పాటు ర్యాలీలో సైతం నిర్వహించి విద్యార్థుల పక్షాన సంఘీభావం తెలపటంతో రక్షణ శాఖ నివారణ చర్యలో భాగంగా ప్రధాన నాయకులను అరెస్టులు కార్యక్రమాలు ఆపై విడుదల సందర్భాలను కొనసాగించారు ఎంతో కష్టపడి విద్యార్థులు ఒక్కొక్క మెట్టు ఎక్కుకుంటూ ఉన్నత స్థాయి అవలంబించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తుంటే అధికార పార్టీ జీవో నెంబర్ 97ను తీసుకువచ్చి విద్యార్థులను నడిసముద్రంలో ముంచే విధంగా నడుచుకుంటుందని నాసా వంటి పరిశోధన కేంద్రాల్లో పాలిటెక్నికల్ విద్యార్థులే ముందంజలో ఉన్నారని ఎందరో ఉత్సావంతులు అనేక వివిధ రకాల సంస్థలలో దూసుకుపోతుంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇనుముల రేవంత్ రెడ్డి పాలిటెక్నికల్ విద్యార్థుల పట్ల పక్షపాతం వహిస్తూ అక్షర రాణి విద్యార్థులంటూ సంబోధించడం సరికాదని వెంటనే ఇటువంటి జీవోను వ్యక్తయాలంటూ నియోజకవర్గం లోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపరెడ్డిపల్లి, చంద్రుగొండ. వంటి మండలాల్లో ప్రధాన బీఆర్ఎస్ నాయకులు తో పాటు మాజీ ఎమ్మెల్యేల సైతం నిరసన కార్యక్రమాలు భారీ స్థాయిల కొనసాగించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న మండలాల్లో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు నో చెప్పండి.. యువతను కాపాడండి!

- రూపారెడ్డి హత్య కేసులో నిందితుల పై కఠిన చర్యలు తీసుకోవాలి
- మొయినాబాద్ లో ఐసా ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ
- డ్రగ్స్ సరఫరా ముఠాలపై ఉక్కుపాదం మోపాలి
- ఐసా జిల్లా కన్వీనర్ చరణ్ గౌడ్




**మొయినాబాద్(ప్రజావాయిస్ ):** మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మొయినాబాద్‌లో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి.. యువతను కాపాడండి" అంటూ విద్యార్థులు, యువత నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఐసా జిల్లా కన్వీనర్ చరణ్ గౌడ్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు పెనుముప్పుగా మారుతోందన్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపారెడ్డి హత్య ఘటనపై కూడా ఐసా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఘటనపై పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు.డ్రగ్స్ రహిత సమాజం కోసం ఐసా ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని, ప్రభుత్వం, పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఐసా జిల్లా సహ కన్వీనర్లు రేశ్వంత్, మణికాంత్, నాయకులు వికాస్, వినోద్, అలీ, కార్తీక్, సాయి చరణ్తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్లూ.. అప్రమత్తంగా ఉండండి

- డ్రాఫ్ట్ జాబితాలో 36,815 ఓట్ల తొలగింపు
- 51,427 మందికి నోటీసులు
- సెప్టెంబరు 16 వరకు కొత్త ఓటర్ల నమోదు
- అక్టోబరు 19న తుది జాబితా
- ఎస్ ఐఆర్ -2పై ఎమ్మెల్యే బాలు నాయక్ సూచన

**ప్రజా వాయిస్,దేవరకొండ:** ఎస్ఐఆర్ రెండో విడత ప్రక్రియపై ఓటర్లు అవగాహనతో సహకరించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కోరారు. దేవరకొండలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 2,69,098 మంది ఓటర్లు ఉండగా.. డ్రాఫ్ట్ జాబితాలో 2,32,283 మంది ఉన్నారని తెలిపారు. వివిధ కారణాలతో 36,815 మంది ఓట్లు తొలగించామన్నారు. మరో 51,427 మందికి నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 27 వరకు గ్రామాల్లో విచారణ జరుగుతుందని, సంబంధిత ఓటర్లు ఆధారాలతో హాజరుకావాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు సెప్టెంబరు 16లోగా ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. అక్టోబరు 19న తుది జాబితా విడుదలవుతుందని తెలిపారు.






## రౌడీ షీటర్ల వ్యవహార శైలిపై నిరంతరం నిఘా పెట్టాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఇ ఐపిఎస్

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల వ్యవహార శైలి పట్ల అధికారులు నిఘా పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, అధికారులను ఆదేశించారు. నెల వారి నేర సమీక్షా సమావేశంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో శనివారం కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపిలు, ఏసిపిలు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి పోలీస్ అధికారి నిరంతరం శ్రమించాల్సి వుంటుందని,ప్రతి పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని ప్రజలతో సత్సంబంధాలను కోనసాగించడంతో పాటు, వారి సమస్యలపై తక్షణమే స్పందించడం ద్వారా ప్రజలు పోలీసుల పట్ల స్నేహపూర్వకమైన వాతవరణం నెలకోల్పడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి శాంతి భద్రతల సంబంధించి ఎలాంటి సమస్యలు వచ్చిన వాటిని సులభంగా పరిష్కరించగలమని, ప్రధానం నేరంగా జరిగిన తరువాత చేసే దర్యాప్తు కన్నా నేరం జరగకుండా తీసుకునే ముందస్తూ చర్యలే కీలకమని. ప్రస్తుతం మత్తు పదార్థాల కారణంగా ఎంతో మంది యువత వారి భవిష్యత్తు అంధకారంగా మారుతోందని. ఈ సమస్యన నివారణకు పోలీస్ అధికారులు మత్తు పదార్థాల వినియోగదారుల గుర్తించడం ద్వారా వారితో విక్రయదారులకు కట్టడి చేయడంతో యువతను డ్రగ్స్ నుండి కాపాడుకోగలమని. ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ సిబ్బంది నియమించి వారి ద్వారా డ్రగ్స్ వినియోగదారులు, విక్రయదారుల సమాచారం సేకరించాలని. గతంలో నేరాలకు పాల్పడి ప్రస్తుతం సమాజంలో జీవిస్తూన్న పాత నేరస్తుల కదలికలపై కుడా పోలీసులు కన్నేసి వుంచాలని, సైబర్ నేరగాళ్ల చేతుల్లో ప్రజలు మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.అనంతరం పెండింగ్ లోని కేసులకు సంబంధించి నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు, ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో వున్న కేసుల స్థితిగతులు, స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరుపై పోలీస్ కమిషనర్ సంబందిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, దారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషన్ సింగ్, అదనపు డిసిపిలు సురేష్‌కుమార్, బాలస్వామితో పాటు ఏసిపిలు ఇతర పోలీస్ అధికారులు పాల్గోన్నారు.





# మిర్చి నారుపై గడ్డి మందు.. రైతుకు కన్నీళ్లు

- నారు చేతికందే వేళ గుర్తుతెలియని వ్యక్తుల నిర్వాకం
- పంట పూర్తిగా ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయిన రైతు
- ఓర్వలేకే పంటను నాశనం చేశారంటూ శంకర్ ఆవేదన
- పోలీసులకు ఫిర్యాదు.. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వేడుకోలు
- నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి

**ప్రజా వాయిస్,పెద్దవూర:** ఎంతో శ్రమించి పెంచిన మిర్చి నారు చేతికందే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో పూర్తిగా ఎండిపోయిన ఘటన నల్గొండ జిల్లా పెద్దవూర మండలం సిరసనగండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు దొరేపెల్లి శంకర్ సాగు చేసిన మిర్చి నారుపై గుర్తుతెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేసినట్లు రైతు తెలిపారు. దీంతో నారు మొత్తం ఎండిపోయి సాగు పెట్టుబడి వృథా కావడంతో తీవ్రంగా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

**కళ్లముందే ఎండిపోయింది..**

మిర్చి సాగు కోసం ఎంతో శ్రమించి నారును పెంచానని, పగలు, రాత్రి తేడా లేకుండా పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నానని శంకర్ తెలిపారు. నారు చేతికందే సమయంలో గడ్డి మందు పిచికారీ చేయడంతో ఒక్కసారిగా మొత్తం ఎండిపోయిందని చెప్పారు. పంటను నాశనం చేయడం వెనుక ఉద్దేశం ఏమిటో తెలియడం లేదని, తనపై ఓర్వలేని మనస్తత్వంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

**విచారణ జరిపి న్యాయం చేయాలి**

ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు. పోలీసులు ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, పరిసర ప్రాంతాల్లోని ఆధారాలను పరిశీలించి నిందితులను గుర్తించాలని కోరారు. పంటను కావాలనే నాశనం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వ్యవసాయ, సంబంధిత అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి అంచనా వేయడంతోపాటు నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని శంకర్ కోరారు.



# ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టిఫిన్ ఏర్పాటు

**ప్రజా వాయిస్ మంథని** ఖానాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టిఫిన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగెం అరుణ గట్టయ్య పాల్గొని, విద్యార్థుల సంక్షేమం కోసం టిఫిన్ అందించిన ఫౌండేషన్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వేణు సాగర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు ఉదయం టిఫిన్ వంటి సౌకర్యాలు కూడా అందుతున్నాయని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు వచ్చిన హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌ను అభినందించారు.

# బీసీ మహిళా మంత్రిని మంత్రివర్గం నుండి తొలగించి అవమానిస్తే సహించేది లేదు

- సోషల్ జస్టిస్ ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షురాలు రేపల్లె స్వర్ణజ



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** కాంగ్రెస్ పార్టీలోని అగ్రకులస్తులు బీసీ మహిళలను మొదటి నుండి టార్గెట్ చేసి అవమానిస్తున్నారు.అదే రెడ్డి కులస్తులు ఏది మాట్లాడినా దానిపై పెద్దగా చర్చలు లేవు.వరంగల్ జిల్లాలో గెలిచిన బీసీ మహిళకు మంత్రి పదవి ఇచ్చాను,మాకు లోబడి పనిచేయాలని భావించడం సరికాదని, సుధీర్ఘ అనుభవం ఉన్న అలాంటి నాయకురాలికి తనే మంత్రి పదవి ఇచ్చి గౌరవించినట్లు మాకు లోబడి పనిచేయాలని భావించడం మానుకోవాలి. మహిళా మంత్రిని తొలగించాలని ప్రభుత్వం భావిస్తే దానికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది అని సోషల్ జస్టిస్ ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణజ హెచ్చరించారు.ఒక మహిళా మంత్రి పై కుట్రలు చేయడం మానుకోవాలి అని,బీసీ మహిళా మంత్రిని తొలగించాలనే కుట్రలను మానుకోవాలి అని సోషల్ జస్టిస్ ఫోరం వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణజ హెచ్చరించారు.

# నో బ్యాగ్ డే సందర్భంగా యూసఫ్ నగర్ పాఠశాల విద్యార్థుల పోలీస్ స్టేషన్ సందర్శన

- సైబర్ నేరాలు, రక్షణపై సీఐ అవగాహన



**ప్రజా వాయిస్, కోరుట్ల:** చదువుకునే వయసులో విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, లక్ష్యంపైదృష్టి పెట్టాలని కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం 'నో బ్యాగ్ డే'సందర్భంగా కోరుట్ల మండలం యూసఫ్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులుస్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు పోస్ట్ ఆఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐవిద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లకు బానిస కావద్దని,విద్యార్థినులు ఆపద సమయంలో పోలీసుల సహాయం తీసుకోవాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్ నిర్వహణ తీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్యామ్ రాజ్, గంగాధర్,ఎంఈఓ గంగుల నరేశం, పోస్టుమాస్టర్ గంగాధర్, ఉపాధ్యాయులు చాంద్ ఖాన్, వెంకటరత్నం, భాస్కర్, రాజగోపాల్, గంగారెడ్డి, రజని, మమత, శైలజ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# ఏబీవీపీ బలోపేతానికి కృషి

- వికారాబాద్ పట్టణ సెక్రటరీగా దూస శివ సాయి



**ప్రజావాయిస్/వికారాబాద్:**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శనివారం వికారాబాద్ పట్టణ నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా వికారాబాద్ పట్టణ ప్రెసిడెంట్‌గా రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.శివ కుమార్,పట్టణ సెక్రటరీగా దూస శివ సాయిలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన టౌన్ సెక్రటరీ దూస శివ సాయి మాట్లాడుతూ..తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తానని అన్నారు.విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా రంగంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని దూస శివ సాయి తెలిపారు. ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.వికారాబాద్ పట్టణంలో ఏబీవీపీని మరింత బలోపేతం చేస్తూ, విద్యార్థులను సంఘటితం చేసి వారి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# శంకర్ నాయక్ నీ వంకర బుద్ధి మార్చుకో..!

## జిల్లా కలెక్టర్ చర్యల ను తప్పుపట్టేంత మొనగాడివా..!



**ప్రజా వాయిస్, బయ్యారం..** మహబూబాద్ జిల్లా, బయ్యారం మండల కేంద్రంలోని స్థానిక కోదండరాం ఫంక్షన్ హాల్లో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహబూబాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ నీ వంకర బుద్ధి మార్చుకో ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం మండలం రాజకీయం నీకేం తెలుసు..! జిల్లా పరిపాలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ను తప్పు పట్టే అంత మొనగాడివా.. నువ్వు , నీ పరిపాలన కాలంలో నీవు చెప్పిన పని చేయని అధికారులను ఎంతమంది బదిలీ చేశావు మాకు తెలియదా. అని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి,బయ్యారం సహకార సంఘ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి మాజి ఎమ్మెల్యే వ్యవహార శైలీపై తీవ్రంగా దుయ్యబట్టారు.గత జులై మాసం నుండి బయ్యారం సొసైటీలో జరిగే చర్యలపై ఏమీ తెలుసుకోకుండా.. శంకర్ నాయక్ అవాక్కులు చెవాక్కులు పేలుతున్నాడని మండిపడ్డారు. బదిలీ అయిన జిల్లా సహకార సంఘం అధికారి విజయ కుమారి తమ విధులను సక్రమంగా నిర్వహించకుండా,వచ్చి నెల రోజుల కాల వ్యవధిలోని బయ్యారం సొసైటీ పై పడి నానా రభస చేయడంతో విషయం జిల్లా మెజిస్ట్రేట్ కు తెలియ పరచకుండా..ఉన్న సమయంలో పరిపాలన విభాగంలో అంతరాలు ఏర్పడటంతో విషయం ను తెలుసుకొని డిసిఓపై కలెక్టర్ చర్యలు తీసుకోవడం జరిగిన విషయం విధితమే,... సొసైటీ విధి విధానాలు బై లా తెలియకుండా వ్యవహరిస్తూ ...పాలకవర్గ డైరెక్టర్ లను అవహేళన చేస్తూ, వారి మాటలు పరిగణలో తీసుకోకుండా వారికి నోటీసులు జారీ చేయకుండా,ఒంటెద్దు పోకడతో బయ్యారం సొసైటీ కి తాత్కాలిక చైర్మన్ నియమించారు.చైర్మన్ విషయంపై మేము తప్పు పట్టడం లేదని డిసిఓ పని తీరుపై వారి చర్యలపై మాత్రమే విమర్శిస్తున్నామని తెలిపారు. డి సి ఓ సంబంధిత వారిపై రాష్ట్ర సహకార సంఘ కమిషనర్ విధివిధానాలను తెలియపరచకుండానే ఆమె సొంత నిర్ణయాలు ఆమె మెడకు చుట్టుకోవడం, దానిని కాంగ్రెస్ పార్టీ కి ,నాకు ఆపాదించడం ఏమిటని ప్రశ్నించారు .శంకర్ నాయక్ బయ్యారం మండల రాజకీయంతో పనేంటని డిసిఒకు శంకర్ నాయక్ ఉన్న ఫెవికాల్ బంధం ఏమిటో తెలపాలని సవాలు విసిరారు. అధికారులు మతాల కులాల విభజన చూసి పనులు చేరని గుర్తు చేశారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు కానీ అధికారుల పక్షాన వకల్తాపుచ్చుకొని బయ్యారం సొసైటీ పై మాజీ చైర్మన్ గా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయన మధుకర్ రెడ్డి పై పదేపదే అవాక్కులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. గతంలో కలెక్టర్ తో ఎలా అనుచితంగా ప్రవర్తించాడో.. రాష్ట్ర ప్రజలకు తెలుసని,ఆయన నీతులు చెప్పాల్సిన పని లేదని గుర్తు చేశారు.నియోజక వర్గంలో తన బినామీ ఆస్తులను కాపాడుకునేందుకు ఇప్పుడున్న జిల్లా కలెక్టర్ ను జిల్లా ఎస్పీని బదనాం చేసి , బ్లాక్ మెయిలింగ్ లకు పాల్పడతా..అని తమ రాజకీయం పబ్బం గడుపుకునేందుకు,అసబంద్ధత మాటలు మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో సరైన విధంగా మానుకోట జిల్లా ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు. సొసైటీ లా ఏమి తెలుసని విమర్శిస్తున్నారని అన్నారు .డిసిసి చర్యలపై బహిరంగ చర్చకు ఎక్కడ వేదిక ఏర్పాటు చేసిన అక్కడికి వస్తానని శంకర్ నాయక్ కు సవాల్ విసిరారు .డిసిఓ చర్యలపై తప్పని తెలిస్తే నీవు రాజకీయ సన్యాసం చేస్తావా, లేదంటే పోయిన డిసిఓ చర్యలు సరైనదే అని మేధావులు వద్ద మీరు సరైనదే అనిపిస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తా.. ముక్కు నేలకు రాస్తా.. అని అన్నారు ,సమయం వేదిక మీరే చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలో కొంతమంది సోషల్ మీడియాలో జిల్లా మెజిస్ట్రేట్ పై ఇతర అధికారులపై అనుచితంగా పోస్టులు పెడుతూ వారి విధి నిర్వహణకు భంగం కలిగించే విధంగా చేస్తున్నారని వారికి కొంత మంది మండలంలోని కొంత మంది రాజకీయ నాయకులు వంత పాడుతూ,ఇదే అదునుగా భావించి నాపై వంకర రాతలు రాస్తూ ఉన్నా భరించానని, జిల్లా అధికారులపై, వంకర రాతలు రాస్తే చర్యలు తీసుకోకుండా ఉండాలా,మేరే న్యాయ నిర్ణేతలా...అని ప్రశ్నించారు. ఇప్పటికైనా శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీపై అనవసరంగా బదనాం చేస్తే చూస్తూ ఊరుకోరని , వారి సేవలు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటున్నారని ప్రజా ప్రతినిధుల పట్ల ప్రజల పట్ల గౌరవంగా వారి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రతినిత్యం పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, బయ్యారం మండలం కాంగ్రెస్ నాయకుల సర్పంచులు ప్రవీణ్ నాయక్, లింగా నాయక్, భూక్య రవి నాయక్, పానుగోతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు..

# చిన్న వయసులోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా మిత్రమా

- కెమికల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన చెన్ను నాగిరెడ్డికి స్నేహితుల కన్నీటి నివాళి



**ప్రజా వాయిస్, నాగార్జునసాగర్**/నల్గొండ కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ఆ ఘోర ప్రమాదం నిన్ను మాకు శాశ్వతంగా దూరం చేస్తుందని ఎవరూ ఊహించలేదు మిత్రమా... చిన్న వయసులోనే ఇలా కళ్లముందు నుంచి కనుమరుగై, తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవాల్సి వచ్చిందా అంటూ నీ స్నేహితుల హృదయాలు తల్లడిల్లుతున్నాయి. భూదాన్‌పోచ ంప ల్లి మండలం దోతిగూడెం పరిధిలోని ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలుడు ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలో పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి మృతి చెందడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి.ఆ భగవంతునికి నీ కన్న బిడ్డలు గుర్తు రాలేదా మిత్రమా... నిన్నే నమ్ముకుని జీవితాన్ని పంచుకున్న నీ కట్టుకున్న భార్య గుర్తు రాలేదా... నిన్ను కంటికి రెప్పలా కాపాడుకున్న నీ తల్లిదండ్రులు, నీతో అడుగడుగునా కలిసి నడిచిన నీ సోదరుడు గుర్తు రాలేదా... నువ్వు చేసిన మంచి, కష్టంలో ఉన్నవారికి అందించిన సహాయం, నీ మంచితనం, నీ స్నేహం... ఏదీ గుర్తుకు రాలేదా ఆ దేవుడికి అంటూ స్నేహితులు కన్నీటి పర్యంతమవుతున్నారు.ఎంతటి వేదిని తట్టుకున్నావో... ఎంతటి నొప్పిని అనుభవించావో తలచుకుంటేనే గుండె పగిలిపోతోంది మిత్రమా. ఆ క్షణాల్లో నువ్వు ఎంత బాధపడ్డావో ఊహించడానికే మనసు ఒప్పుకోవడం లేదు. కానీ నువ్వు మమ్మల్ని వదిలి వెళ్లిపోయిన ఈ నిజాన్ని మాత్రం మనసు అస్సలు అంగీకరించలేకపోతోంది.నీ స్నేహితులకు చిన్న బాధ వచ్చినా ముందుండే నువ్వు... ఎవరికైనా కష్టం వస్తే వెంటనే చేయూతనిచ్చే నువ్వు... అందరి కళ్లలో ఆనందం చూడాలని కోరుకునే నువ్వు... ఈరోజు మాత్రం మమ్మల్ని కన్నీటి సముద్రంలో ముంచి వెళ్లిపోయావు మిత్రమా.నువ్వు లేవనే నిజం బాధిస్తోంది... కానీ నీ జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మా మధ్యే ఉంటాయి. నీ నవ్వు... నీ స్నేహం... నీ మంచితనం... నువ్వు చేసిన సహాయం... ఎన్నటికీ మర్చిపోలేం మిత్రమా.శాంతించు మిత్రమా... నువ్వు మా కళ్లకు కనిపించకపోయినా, మా గుండెల్లో మాత్రం ఎప్పటికీ బ్రతికే ఉంటావు...నీ జ్ఞాపకాలతో... నీ మిత్రులు..

# మంత్రి వస్తే కానీ బాత్రూంలు ప్రారంభం కావు

- అర్ధరాత్రి అయినా భైర్భూమికి బయటకు పోవాల్సిందే
- చుట్టూ చీకటి.. ఎటువైపు నుంచి ఏమొస్తుందో తెలియదు
- ఇది సింగూర్ గురుకుల పాఠశాల విద్యార్థుల పరిస్థితి

**ప్రజా వాయిస్ సంగారెడ్డి:** ఎ సమయంలో ఎటువైపు నుంచి విష సర్పాలు వస్తాయో తెలియదు. అత్యవసరంగా బాత్రూం వస్తే బయటికి పోవాల్సిందే... పాత భవనంలో ఉన్న బాత్రూంలకు తాళ్లలు వేశారు.. కొత్తగా నిర్మించిన వాటిలోకి వెళ్లాలంటే మంత్రి వస్తే గానీ ప్రారంభం కాదని తాళాలు వేశారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ పరిశ్రమల సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు మంత్రి రాక కోసం ఎదురుచూస్తున్నాయి. ఇది ఎక్కడో కాదు సాక్షాత్తు మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న సింగూర్ గురుకుల పాఠశాల పరిస్థితి. ఈ పాఠశాలలో 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులు సుమారు 500 మంది వరకు విద్యను అభ్యసిస్తున్నారు. భవన నిర్మాణ సమయంలో అప్పటి కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి పైప్ లైన్లను ఏర్పాటు చేశారు. అవి ఎక్కడికక్కడ పగిలిపోయి లీకేజ్ కావడంతో ప్రభుత్వం సి ఎస్ ఆర్ నిధుల నుంచి ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగానే గత ఏడాది ఓ పరిశ్రమకు సంబంధించిన నిధుల నుంచి 15 వ్యక్తిగత మరుగుదొడ్లతో పాటు 15 స్నానాల గదులను ఏర్పాటు చేయాలని నిర్మాణం చేశారు.. నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ ప్రారంభించేందుకు మంత్రి రాకపోవడంతో పాత బాత్రూంలోకి వెళ్లలేక ఏం చేయాలో తెలియని పరిస్థితిలో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో నిర్మించిన బాత్రూములకు సిబ్బంది తలాలు వేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు బహిర్భూమికి బయటకు వెళ్లవలసిన పరిస్థితి. ఈ సమయంలో పాఠశాల ఆవరణలో అటు ఇటు వైపున వ్యవసాయ పంట పొలాలు ఉన్నాయి. అంటే పంట పొలాల్లో విష సర్పాలు సంచరిస్తాయని చెప్పవచ్చు. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు బయటకు వెళ్లక తప్పని పరిస్థితి. దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ ను ప్రశ్నిస్తే మంత్రి వస్తే గాని ప్రారంభించలేమంటూ చేతులెత్తేస్తున్నాను. విద్యార్థులు స్నానం అయితే ఎక్కడైనా చేయొచ్చు... కానీ బైరు భూమికి వెళ్లాలంటే మాత్రం ప్రమాదకరమైన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి మంత్రికి సమయం లేదనుకుంటే జిల్లా అధికారులు ఎవరైనా ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు.









# గచ్చిబౌలి భవన ప్రమాదంపై హైడ్రా ఆరా

- అంజయ్యనగర్ లో కూలిన ఏడంతస్తుల భవనం పరిశీలించిన కమిషనర్ రంగనాథ్
- నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రమాదకర భవనాలపై ప్రత్యేక డ్రైవ్
- చర్యలు తప్పవన్న హైడ్రా

**ప్రజా వాయిస్,హైదరాబాద్:** గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కూలిన ఘటనపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆరా తీశారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఆయన, భవనం కూలడానికి గల కారణాలు,నిర్మాణానికి సంబంధించిన అనుమతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎంసీ కమిషనర్ సృజన, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్యతో కలిసి సహాయక చర్యలను సమీక్షించారు.కూలిన భవనం పక్కనే ఉన్న జయదర్శిని అపార్ట్‌మెంట్‌ను కూడా కమిషనర్ పరిశీలించారు. అన్ని అంతస్తుల్లో పరిస్థితిని పరిశీలించి,అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడారు. శిథిలాలను తొలగించిన అనంతరం భవనం సామర్థ్యాన్ని నిపుణులతో తనిఖీ చేసి ధ్రువీకరిస్తామని తెలిపారు.అప్పటి వరకు దెబ్బతిన్న వైపు ఎవరూ ఉండవద్దని సూచించారు. హైడ్రా,ఎన్డీఆర్ఎఫ్,సీఎంసీ, పోలీసు బృందాల సహాయక చర్యలను పర్యవేక్షించారు.

## నాలాకు ఆనుకుని అక్రమ నిర్మాణాలు

అంజయ్యనగర్‌లో నాలాకు ఆనుకుని అనేక భవనాలు అనుమతులు లేకుండా నిర్మించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు రంగనాథ్ తెలిపారు.తక్కువ విస్తీర్ణంలోనే ఏడంతస్తుల భవనాలు నిర్మించి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని పేర్కొన్నారు.పలు భవనాలకు నిబంధనలకు అనుగుణంగా సెట్‌బ్యాక్‌లు లేవని తెలిపారు.

## ప్రమాదకర భవనాలపై ప్రత్యేక డ్రైవ్

అంజయ్యనగర్‌లోని భవనాలపై సీఎంసీతో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని కమిషనర్ వెల్లడించారు.నిబంధనలకు విరుద్ధంగా,ప్రమాదకరంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గతంలో ఫిర్యాదు అందడంతో కూలిన భవన నిర్మాణ పనులను నిలిపివేసినప్పటికీ,తిరిగి పనులు ప్రారంభించినట్లు సీఎంసీ కమిషనర్ సృజన తెలిపారు.హైడ్రాతో కలిసి ప్రాంతంలోని భవనాలను సమగ్రంగా పరిశీలిస్తామని ఆమె పేర్కొన్నారు.



# జోగిపేటలో రెచ్చిపోతున్న కబ్జా దారులు

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా అందోల్ – జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ, కందక స్థలాలు అన్యాక్రాంత మవుతున్నాయి. తాజాగా 17వ వార్డులో కందకానికి చెందిన స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతుండగా ముదిరాజ్ సంఘం సభ్యులు, కాలనీవాసులు తీవ్రంగా వ్యతిరేకించారు. సంగారెడ్డి జిల్లా అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కాలనీకి చెందిన కందకం స్థలాన్ని, రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి సుమారు 15 అడుగుల మేర అక్రమ భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు.అయ్యప్ప విజయ్ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా ఈ అక్రమ నిర్మాణానికి పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తాతల కాలం నాటి నుంచి ప్రజా అవసరాల కోసం ఉన్న కందక స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని మండిపడుతున్నారు.ఈ అక్రమ నిర్మాణంపై బాధితులు మున్సిపల్ అధికారులకు, కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన కరువైందనీ ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని స్థానిక ముదిరాజ్ కులస్తులు డిమాండ్ చేశారు .మా కాలనీకి దారినిచ్చే కందకం స్థలాన్ని పెద్ద ఎత్తున కబ్జా చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని వారి తీరుపై మండిపడుతున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు స్పందించి జోగిపేట మున్సిపాలిటీలో జరుగుతున్న కబ్జాలపై సమగ్ర విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోని డిమాండ్ చేశారు.

# గ్రామసభలో రగిలిన వివాదం.. సర్పంచ్ భర్తపై దాడి?

- తీర్మాన అంశంపై చర్చిస్తుండగా ఉపసర్పంచ్ దాడి చేశారంటూ ఫిర్యాదు
- చేయిపై కొట్టి.. చేయి పట్టుకుని ఈడ్చే ప్రయత్నం చేశారని సర్పంచ్ ఆరోపణ
- పోలీసులు, ఎంపీడీవోకు ఫిర్యాదు
- విచారణతో వాస్తవాలు తేల్చాలని డిమాండ్



**పెద్ద శంకరంపేట, ప్రజా వాయిస్:** పెద్ద శంకరంపేట మేజర్ గ్రామ పంచాయతీలో శనివారం నిర్వహించిన గ్రామసభలో చోటుచేసుకున్న ఘటన వివాదాస్పదంగా మారింది. గ్రామసభలో తీర్మాన అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో సర్పంచ్ జంగం రేణుక భర్త జంగం శ్రీనివాస్‌పై ఉపసర్పంచ్ రాజు గౌడ్ దాడికి పాల్పడ్డారంటూ సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.సర్పంచ్ ఫిర్యాదు ప్రకారం..గ్రామసభలో జంగం శ్రీనివాస్ తీర్మానానికి సంబంధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడుతున్న సమయంలో ఆయన పక్కనే కూర్చున్న ఉపసర్పంచ్ రాజు గౌడ్ ఒక్కసారిగా లేచి శ్రీనివాస్ కుడి చేతిపై బలంగా కొట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం కుర్చీ నుంచి లేచి ఆయన వద్దకు వెళ్లి చేయి పట్టుకుని గుంజుతూ, దుర్భాషలాడుతూ బయటకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

### గ్రామస్తుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం


ఘటనతో గ్రామసభలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, అక్కడే ఉన్న పలువురు గ్రామస్తులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సముదాయించినట్లు సర్పంచ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామసభ జరుగుతున్న ప్రదేశంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది.

### గతంలోనూ ఇలాంటి ఘటనలేనా?

తన భర్తపై గతంలోనూ ఇలాంటి దాడి ప్రయత్నాలు జరిగాయని సర్పంచ్ జంగం రేణుక ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సమక్షంలో నిర్వహించే గ్రామసభలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. తన భర్తకు రక్షణ కల్పించడంతో పాటు ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

### పోలీసులకు.. ఎంపీడీవోకు ఫిర్యాదు

ఘటనపై సర్పంచ్ జంగం రేణుక పెద్ద శంకరంపేట పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను విచారించి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.అయితే ఈ ఆరోపణలపై ఉపసర్పంచ్ రాజు గౌడ్ వివరణ తెలియాల్సి ఉంది. ఇరువర్గాల వాదనలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించిన అనంతరం పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.



# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆరుతడి పంటలవైపు రైతులు ముగ్గు చూపాలి
- గోపాల్ దిన్నె రిజర్వాయర్ వరకు లింకు కెనాల్ ఏడాదిలో పూర్తి చేస్తాం
- చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగనీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఈనెల 24 తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోడబల్ రోడ్డు నిర్మాణ పనులు శంకుస్థాపన
- మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజా వాయిస్.. వనపర్తివీపనగండ్ల** కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం చిన్నంబావి మండల పరిధిలోని చిన్నమారూర్ ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలిసి మంత్రి పరిశీలించారు.ఈ సందర్భంగా మండల ప్రజలను ఉద్దేశించి మంత్రి జూపల్లి మాట్లాడుతూ,,, చిన్నమారూర్ లిఫ్ట్ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.రైతులు తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు.చిన్నమారూర్ లిఫ్ట్ నిర్వహణ కోసం త్వరలోనే కమిటీ ఏర్పాటు చేసి చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకుంటామని చెప్పారు.సింగోటం నుంచి గోపాల్‌దిన్నె రిజర్వాయర్ వరకు లింక్ కెనాల్ పనులను ఏడాది లోపు పూర్తి చేసి చిన్నంబావి మండలంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.అదేవిధంగా చిన్నంబావి నుంచి చెల్లపాడు వరకు, వీపనగండ్ల నుంచి కేతపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ఈ నెల 24న తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కృష్ణ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పోడు భూముల్లో బలవంతపు ప్లాంటేషన్ ఆపాలనీ జిల్లా ఫారెస్ట్ కార్యాలయం ముట్టడి

- పోడు రైతుల జోలికొస్తే తీవ్ర పరిణామాలు
- సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా ఆందోళన

**ప్రజా వాయిస్ కామారెడ్డి/** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఫారెస్ట్ కార్యాలయం ముట్టడి గిరిజనుల్లో భూముల్లో అక్రమ ప్లాంటేషన్ వెంటనే ఆపాలని ధర్నా చేపట్టారు. గిరిజన రైతులకు మద్దతుగా పాల్గొని సిపిఎం జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్ డిమాండ్ చేశారు వారసత్వంగా కబ్జాలో ఉంటున్న భూముల్లో బక్కపల్సని డబ్బులు లేని గిరిజన రైతు భూములను బలవంతంగా అధికారులు గుంజుకుంటున్నారని ఆయన విమర్శించారు ముట్టడి అనంతరం ఫారెస్ట్ అధికారులు బలవంత ప్లాంటేషన్ ఆపేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయకులు సుభాష్ రమేష్ గణేష్ సీట్యా కమల సరోజ శారద తదితరులు పాల్గొన్నారు




# అక్షరాలతో బతికిన జర్నలిస్టు.. నేడు బతుకు కోసం భిక్షాటన!

- ఒకప్పుడు వార్తల కోసం మెదక్ వీధుల్లో తిరిగిన బోనాల రమేష్
- నేడు అదే వీధుల్లో జీవనం కోసం చేయి చాస్తున్న విషాదం!
- మూడు దశాబ్దాల జర్నలిజం ఇప్పటికీ జ్ఞాపకాల పొరల్లో పదిలమే
- చిరిగిన బట్టలు.. చేతిలో బీడీ.. మౌనంగా పట్టణ వీధుల్లో సంచారం
- 2015లోనే 'ప్రాణాలు కాపాడండి' అంటూ వినిపించిన ఆర్తనాదం
- పదకొండేళ్లు గడిచినా మారని బతుకు చిత్రం
- ఎన్నిసార్లు 'మెతుకు సీమ టైమ్స్'లో కథనాలు
- చేతనైన ఆర్థిక సాయమూ చేశాం
- ఒక్కరి సహాయంతో కాదు.. సమాజమే చేయి పట్టాల్సిన సమయం
- జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామికవాదులు, మానవతావాదులు స్పందించాలి!

**ప్రజా వాయిస్ సంగారెడ్డి:** ఒకప్పుడు అతని చేతిలో కలం ఉండేది...ఈ రోజు అదే చేతులు బతుకు కోసం ఇతరుల ముందు చాచాల్సి వస్తోంది!ఒకప్పుడు మెదక్ పట్టణంలోని వీధుల్లో వార్త కోసం తిరిగేవాడు...ఈ రోజు అదే వీధుల్లో కడుపు నింపుకోవడానికి భిక్షాటన చేస్తూ కనిపిస్తున్నాడు!ఒకప్పుడు ప్రజల కష్టాలను అక్షరాలుగా మార్చిన జర్నలిస్టు...ఈ రోజు తన కష్టాన్ని ప్రపంచానికి చెప్పుకోలేక మౌనంగా నడుస్తున్నాడు! అతనే రమేష్.మెదక్ ప్రాంతంలో ఒకప్పుడు జర్నలిస్టుగా పనిచేసి తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న రమేష్ ప్రస్తుత జీవితం చూస్తే మనసున్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తుంది.చిరిగిపోయిన బట్టలు... చేతిలో బీడీ... నిర్లిప్తంగా కనిపించే ముఖం... ఎవరితోనూ పెద్దగా మాట్లాడకుండా మెదక్ పట్టణంలోని వీధుల్లో తిరుగుతున్న రమేష్‌ను చూసిన పాతతరం వారికి మాత్రం ఒక్కసారిగా గతం గుర్తుకొస్తుంది."ఈయనేనా ఒకప్పుడు అంత చురుగ్గా తిరిగిన జర్నలిస్టు?"అనే ప్రశ్న వెంటాడుతుంది.శరీరం అలసిపోయింది.. జ్ఞాపకం మాత్రం చెక్కుచెదరలేదు!రమేష్‌తో కొద్దిసేపు కూర్చుని మాట్లాడితే ఆశ్చర్యం కలుగుతుంది.ప్రస్తుత జీవితం అస్తవ్యస్తమైపోయినా, గత జర్నలిజం జ్ఞాపకాలు మాత్రం అతని మదిలో ఇంకా సజీవంగానే ఉన్నాయి.దాదాపు మూడు దశాబ్దాల క్రితం జరిగిన జర్నలిస్టు జీవితంలోని సంఘటనలు, అప్పటి వ్యక్తులు, వార్తలు, పరిచయాలు, మెదక్ ప్రాంతంలోని పరిణామాలను ఇప్పటికీ గుర్తుచేసుకుంటూ మాట్లాడుతుంటాడు.కాలం అతని రూపాన్ని మార్చేసింది.పేదరికం అతని జీవితాన్ని కుంగదీసింది.పరిస్థితులు అతన్ని రోడ్డుపైకి తీసుకొచ్చాయి.కానీ అతని జ్ఞాపకాల నుంచి 'జర్నలిస్టు రమేష్'ను మాత్రం చెరిపేయలేకపోయాయి.అదే అతని విషాద జీవితంలోని అత్యంత భావోద్వేగమైన కోణం.ఒకప్పుడు ప్రపంచ బాధే తన బాధగా...జర్నలిజం అంటే ఉద్యోగం మాత్రమే కాదు.ప్రజల సమస్యను తన సమస్యగా భావించడం... అన్యాయం జరిగితే ప్రశ్నించడం... బాధితుడి కన్నీటిని అధికార వ్యవస్థ ముందుంచడం... గొంతులేని వారికి గొంతుగా నిలవడం— ఇవన్నీ జర్నలిస్టు జీవితంలో భాగం.రమేష్ కూడా అలాంటి జీవితాన్నే గడిపాడు.ఇతరుల కష్టాలను వార్తలుగా రాశాడు.ఇతరుల సమస్యలను సమాజం ముందుంచాడు.ఇతరులకు న్యాయం జరగాలని తనవంతుగా ప్రయత్నించాడు.ప్రపంచ బాధను తన బాధగా భావించిన ఆ జర్నలిస్టు... ఇప్పుడు తన బాధను ఎవరికీ చెప్పుకోలేని స్థితిలో నిలిచాడు.ఇంతకంటే విషాదం ఇంకేముంటుంది?2015లోనే వినిపించిన ఆర్తనాదం! రమేష్ జీవితం ఒక్కరోజులో ఇలా మారలేదు.2015లోనే ఆయన పరిస్థితిపై "ప్రాణాలు కాపాడండి..!" అంటూ ప్రత్యేక కథనం ప్రచురితమైంది.అప్పుడే ఎన్నో ప్రశ్నలు సమాజం ముందు ఉంచబడ్డాయి.ప్రపంచ బాధ అంతా తన బాధగా వార్తలు రాసిన వ్యక్తి పరిస్థితి ఏమిటి?విలువైన కుటుంబ జీవితం ఎందుకు ఇలా ఛిన్నాభిన్నమైంది?అతనికి వైద్య సహాయం ఎవరు అందించాలి?జర్నలిస్టుగా పనిచేసిన వ్యక్తిని సమాజం ఎందుకు పట్టించుకోవడం లేదు?అని అప్పుడే ప్రశ్నించాం.కానీ సంవత్సరాలు గడిచిపోయాయి.ప్రభుత్వాలు మారాయి.అధికారులు మారారు.జర్నలిస్టు సంఘాల నాయకత్వాలు మారాయి.మెదక్



పట్టణ రూపురేఖలు కూడా మారాయి.కానీ రమేష్ బతుకు మాత్రం మారలేదు!పదకొండేళ్ల తర్వాత కూడా అదే ప్రశ్న! 2015లో రమేష్ ప్రాణాలు కాపాడాలని సమాజాన్ని కోరాం. ఇప్పుడు 2026.దాదాపు పదకొండేళ్లు గడిచిపోయాయి.అయినా మళ్లీ అదే విజ్ఞప్తి చేయాల్సిన పరిస్థితి రావడం మనందరికీ ఆత్మ పరిశీలన కలిగించాలి.అప్పుడు చికిత్స అవసరమైన వ్యక్తి...ఈ రోజు కనీస జీవన భద్రత కూడా లేని పరిస్థితిలో మెదక్ వీధుల్లో తిరుగుతున్నాడు.అతడిని చూసిన వారు కొందరు జాలి పడుతున్నారు.కొందరు కొంత డబ్బు ఇస్తున్నారు.మరికొందరు ఆహారం పెడుతున్నారు.కానీ ఇవన్నీ ఆ రోజు ఆకలిని తీర్చగలవేమో తప్ప రమేష్ జీవితాన్ని తిరిగి గాడిలో పెట్టలేవు.భిక్ష కాదు.. బతుకుకు భరోసా కావాలి! రమేష్‌కు ఇప్పుడు కావాల్సింది అప్పుడప్పుడు ఇచ్చే పది రూపాయలో, వంద రూపాయలో కాదు.ఒక సమగ్ర పునరావాసం కావాలి.ముందుగా ఆయన ప్రస్తుత శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరిశీలించాలి. అవసరమైన చికిత్స, పోషకాహారం, పరిశుభ్రమైన దుస్తులు, సురక్షితమైన వసతి కల్పించాలి.ఆ తర్వాత ఆయన కుటుంబ పరిస్థితిని తెలుసుకొని కుటుంబ సభ్యులతో తిరిగి అనుబంధం ఏర్పడే అవకాశం ఉంటే అందుకు ప్రయత్నించాలి.ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నెలవారీ జీవన భృతి లేదా ఇతర అర్హత కలిగిన సహాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.అప్పుడే రమేష్ జీవితంలో నిజమైన మార్పు వస్తుంది.జర్నలిస్టు సంఘాలు ఎక్కడ?ఈ ప్రశ్న బాధతోనే అడగాల్సి వస్తోంది.నిన్నటివరకు మనతో కలిసి పనిచేసిన వ్యక్తి...మనతో కలిసి వార్తల కోసం తిరిగిన వ్యక్తి...మన వృత్తిలో భాగమైన వ్యక్తి...ఈ రోజు రోడ్డుపై భిక్షాటన చేస్తుంటే జర్నలిస్టు సమాజానికి కూడా బాధ్యత లేదా?సన్మానాలు, సమావేశాలు, మహాసభలు నిర్వహించడం మాత్రమే సంఘాల బాధ్యత కాదు.కష్టాల్లో పడిన ఒక జర్నలిస్టును తిరిగి నిలబెట్టడం అంతకంటే గొప్ప సంఘ సేవ.మెదక్ జిల్లా జర్నలిస్టు సంఘాలన్నీ రాజకీయాలు, విభేదాలను పక్కన పెట్టి రమేష్ విషయంలో ఒకే వేదికపైకి రావాలి.ఒక్కరోజు ఫొటో తీసుకుని సహాయం అందించి వెళ్లిపోవడం కాదు.అతని పునరావాసం పూర్తయ్యే వరకు బాధ్యత తీసుకునే 'రమేష్ పునరావాస కమిటీ' ఏర్పాటు చేయాలి.'మెతుకు సీమ టైమ్స్' ప్రయత్నించింది.. కానీ అది సరిపోలేదు!రమేష్ పరిస్థితిపై గతంలోనూ మెతుకు సీమ టైమ్స్ పలుమార్లు ప్రత్యేక కథనాల ద్వారా సమాజం దృష్టికి తీసుకొచ్చింది.మా స్థాయిలో చేతనైనంత ఆర్థిక సహాయం కూడా అందించాం.అతని జీవితం మారాలని కోరుకున్నాం.అయితే ఒక పత్రిక లేదా కొంతమంది వ్యక్తులు చేసే సహాయం మాత్రమే ఇంత తీవ్రమైన సమస్యకు శాశ్వత పరిష్కారం కాదన్న వాస్తవాన్ని అంగీకరించాల్సి వస్తోంది.రమేష్‌ను సంపూర్ణంగా కోలుకునేలా చేసి, గౌరవప్రదమైన జీవితంలోకి తీసుకురావడంలో ఇప్పటికీ మనం విజయం సాధించలేకపోయాం.అందుకే ఈ కథనం మరో వార్త కాదు.ఇది సమాజానికి చేస్తున్న విజ్ఞప్తి.కలెక్టర్ స్పందించాలి!మెదక్ జిల్లా కలెక్టర్ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలి.సంబంధిత సంక్షేమ శాఖలు, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు కలిసి రమేష్ ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవాలి.అవసరమైతే ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించాలి.అర్హతను బట్టి ప్రభుత్వ పథకాల పరిధిలోకి తీసుకురావాలి.సురక్షితమైన ఆశ్రయం కల్పించాలి.ఒకప్పుడు సమాజానికి సేవ చేసిన జర్నలిస్టు తన చివరి రోజుల వరకు రోడ్లపై చేయి చాస్తూ జీవించాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి.మానవతావాదులూ.. ఒక్కసారి చూడండి!మెదక్‌లో ఎంతోమంది దాతలు ఉన్నారు.సేవా సంస్థలు ఉన్నాయి.వ్యాపారవేత్తలు ఉన్నారు.ప్రజాప్రతినిధులు ఉన్నారు.జర్నలిస్టు సంఘాలు ఉన్నాయి.స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి.వీరిలో కొందరు కలిసి బాధ్యత తీసుకున్నా రమేష్ జీవితాన్ని మార్చడం అసాధ్యం కాదు.ఒక్కొక్కరు విడివిడిగా ఇచ్చే చిన్న సహాయాన్ని ఒక వ్యవస్థీకృత పునరావాస ప్రయత్నంగా మార్చాలి.రమేష్‌కు భిక్ష వేయడం కాదు... భిక్ష అడగాల్సిన అవసరం లేని జీవితాన్ని ఇవ్వాలి.అదే నిజమైన మానవత్వం.ఒకప్పుడు వార్త రాసిన చేతులు.. నేడు సహాయం కోసం!ఊహించుకుంటేనే మనసు బరువెక్కుతుంది.ఒకప్పుడు అదే చేతులతో వార్తలు రాశాడు.ప్రజల సమస్యలను కాగితంపై పెట్టాడు.అధికారులను ప్రశ్నించాడు.బాధితులకు న్యాయం జరగాలని కోరాడు.ఇప్పుడు అదే చేతులు తన ఆకలి తీర్చుకోవడానికి ఇతరుల ముందు చాచాల్సి వస్తోంది.ఇది రమేష్ వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు.వృత్తిలో ఉన్నంతకాలం ఒకరిని గౌరవించి, కష్టాల్లో పడిన తర్వాత మరచిపోయే మన సామాజిక వ్యవస్థను ప్రశ్నించే దృశ్యం.ఇంకా ఆలస్యం చేయొద్దు!రమేష్‌కు ఇప్పుడు కావాల్సింది సానుభూతి మాటలు కాదు.చర్య.ఒక్కరోజు సహాయం కాదు.దీర్ఘకాలిక భరోసా.భిక్ష కాదు.గౌరవప్రదమైన జీవితం.ఒక్క జర్నలిస్టు సంఘం కాదు.జర్నలిస్టు సమాజమంతా కలిసి నిలబడాలి.ప్రజాస్వామికవాదులు రావాలి.మానవతావాదులు స్పందించాలి.ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకోవాలి.ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలి.చివరి ప్రశ్న...ఒకప్పుడు ప్రజల కోసం కలం పట్టిన జర్నలిస్టు...ఈ రోజు ప్రజల ముందే చేయి చాచి బతకాల్సిందేనా?అతని జ్ఞాపకశక్తిలో మూడు దశాబ్దాల జర్నలిజం ఇంకా బతికే ఉంది.అతని లోపల జర్నలిస్టు ఇంకా చనిపోలేదు.కానీ అతని జీవితం మాత్రం మన కళ్లముందే క్రమంగా కూలిపోతోంది.2015లో "ప్రాణాలు కాపాడండి" అని అడిగాం.2026లో మళ్లీ అదే మాట అడగాల్సి వస్తోంది—రమేష్‌కు భిక్ష వేయకండి... అతని బతుకును నిలబెట్టండి!ఒక్కసారి అందరం చేయి కలిపితే... ఒక జర్నలిస్టుకు తిరిగి గౌరవప్రదమైన జీవితం ఇవ్వగలం.ప్రత్యేక బాక్స్2015 నుంచి 2026 వరకు... మారనిది రమేష్ బతుకే!2015: 'ప్రాణాలు కాపాడండి' అంటూ ప్రత్యేక కథనంనాడు: ఆరోగ్యం, కుటుంబ పరిస్థితిపై ఆందోళననేడు: మెదక్ పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవనంఆశ్చర్యం: దశాబ్దాల నాటి జర్నలిజం జ్ఞాపకాలు ఇప్పటికీ పదిలంఅవసరం: వైద్య పరీక్షలు – పునరావాసం – వసతి – జీవన భద్రతబాధ్యత: ప్రభుత్వం – జర్నలిస్టు సంఘాలు – ప్రజాప్రతినిధులు – దాతలు – స్వచ్ఛంద సంస్థలుమన లక్ష్యం: 'సహాయం'తో ఆగకుండా రమేష్‌ను తిరిగి గౌరవప్రదమైన జీవితంలో నిలబెట్టడం.

# బయ్యారం మండలంలో ఎమ్మెల్యే పర్యటన..

**అరకపట్టి పొలం దున్నిన ఎమ్మెల్యే కనకయ్య..**

**సంతులాల్ పోడు తండా గ్రామంలో ప్రజా ప్రభుత్వం అందచేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డ్ లు పంపిణి..**

**ప్రజా వాయిస్, బయ్యారం..**

మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సుడిగాలి పర్యటన చేశారు.తొలత ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికి అందచేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణి కార్యక్రమంలో భాగంగా సంతులాల్ పోడు తండా గ్రామంలో సర్పంచ్ గుగులోత్ మణి అధ్యక్షతన నిర్వహించిన పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హజరై అర్హులందరికి రేషన్ కార్డులు పంపిణి చేసారు.అనంతరం తెలంగాణ రాష్ట వ్యాప్తంగా ఏలినినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదు అవుతుండడంతో వరికి బదులు అంతర



పంటలపై దృష్టి సారించాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం సూచనల మేరకు రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించి, స్థానిక రైతు చగార్లముడి భాస్కర్ వ్యవసాయ పొలంలో అరక పట్టి సాలు దున్ని పెసర విత్తనాలు చల్లి, రైతులంతా అంతర పంటలపై దృష్టి సారించాలని తెలియ చేశారు.కొత్తపేట గంధంపల్లి గ్రామంలో పంచాయితిరాజ్ విభాగం 30 లక్షల రూపాయల నిధులతో ప్రభుత్వ పాఠశాల ప్రహరిగోడ, అంగన్వాడి పాఠశాల ప్రహరి గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, పాఠశాల నిర్మాణం కొరకు తన సొంత స్థలాన్ని ధానం చేసిన వెంకటేశ్వరావు శాలువతో సన్మానించి, ధన్యవాదములు తెలియచేసారు.ఈ పర్యటనలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,బయ్యారం సొసైటి మాజీ చైర్మెన్ మూల మధుకర్ రెడ్డి సర్పంచ్ లు భుక్యా ప్రవీణ్ నాయక్, గుగులోత్ మణి,ఎట్టి సరోజ,రసమల్ల నాగేశ్వరరావుఎనుగుల రాకేష్,అవిదినేని వెంకటేశ్వరరావు, వడ్లముడి కొటేశ్వరరావు, శ్రీనివాసరావు, సురేష్, పల్లయ్య,రాముర్తి తదితరులు పాల్గోన్నారు..



# రైతులకు న్యాయం చేయాలి

**- కంపెనీలు ఏర్పాటు చేయకపోతే భూములు తిరిగి ఇవ్వాలి**

**- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**

**ప్రజావాయిస్/మోమిన్‌పేట్:**

వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలం ఎన్కతల గ్రామంలో ఏర్పాటు కానున్న 1,100 ఎకరాల మొబిలిటీ వ్యాలీ ప్రాంతాన్ని శనివారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి వారి సమస్యలు, ఆందోళనలను అడిగి తెలుసుకున్నారు. రైతుల భూములను అభివృద్ధి కోసం తీసుకున్న ప్రభుత్వం, వారికి తగిన పరిహారం అందించడంతో పాటు స్థానిక రైతులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మెతుకు ఆనంద్ అన్నారు. మొబిలిటీ వ్యాలీకి కంపెనీలను తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైతే రైతుల భూములను తిరిగి వారికి అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు.రైతులకు న్యాయం చేయాలి.తగిన పరిహారం అందించాలి.. స్థానికులకు ఉపాధి కల్పించాలి.. లేకపోతే భూములను తిరిగి ఇవ్వాలి అంటూ వారు ఘాటుగా స్పందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో మంత్రి జూపల్లి

**మూడు రోజులుగా కొల్లాపూర్ నియోజకవర్గంలో విస్తృత పర్యటన**

**అభివృద్ధి, సంక్షేమంపై సమీక్షలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి**

**అధికారుల్లో జవాబుదారీతనం కొరవడితే సహించేది లేదు**

**రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యంపై అధికారుల తీరుపై అసహనం**

**ప్రజా వాయిస్.. వనపర్తి**

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం కావాలనే లక్ష్యంతో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. వరుసగా మూడో రోజు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి.. ఒకవైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూనే, మరోవైపు ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.

**స్టేడియాల నిర్మాణానికి కసరత్తు**

కొల్లాపూర్ నియోజకవర్గంలో క్రీడా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని



పెంపొందించడంతో పాటు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో స్టేడియాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.ఇందులో భాగంగా శనివారం పెంట్లవెల్లిలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొల్లాపూర్ పట్టణంతో పాటు వీపనగండ్ల, పానగల్ మండలం కేతపల్లి గ్రామం, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాల్లో స్టేడియాల నిర్మాణానికి కసరత్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని, అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**మ్యూటేషన్లకు ఏళ్ల తరబడి తిప్పించుకోవడమేంటి?**

అనంతరం పెంట్లవెల్లి మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై అధికారులతో మంత్రి చర్చించారు. ప్రజలు, రైతులు తమ సమస్యలను మంత్రికి వివరించగా.. ఆయన ఓపికగా విని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు.ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మ్యూటేషన్ల కోసం దీర్ఘకాలంగా మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల సమస్యలపై మంత్రి జూపల్లి తీవ్రంగా స్పందించారు. ఏళ్ల తరబడి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వస్తే సత్వరం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జవాబుదారీతనంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తన పర్యటనల ఉద్దేశమని మంత్రి తెలిపారు.



# ఆగస్టు 28నే రాఖీ పండుగ.. పండితుల స్పష్టత!

**ప్రజా వాయిస్ హన్మకొండ / కాకతీయ యూనివర్సిటీ**

శ్రావణ పౌర్ణమి తిథి ఆగస్టు 27 ఉదయం 9:08 గంటలకు ప్రారంభమై ఆగస్టు 28 ఉదయం 9:48 గంటల వరకు ఉండటంతో.. ఈ ఏడాది రాఖీ పండుగను ఆగస్టు 28న జరుపుకోవాలని పండితులు స్పష్టం చేశారు. రాఖీ కట్టడానికి ఆగస్టు 28 ఉదయం 6:23 నుంచి 9:48 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 12:14 నుంచి 1:05 గంటల వరకు (అభిజిత్ ముహూర్తం) అత్యంత శుభప్రదమైన సమయాలు. ఈ ఏడాది భద్ర కాలం సూర్యోదయానికి ముందే ముగిసిపోవడంతో ఆగస్టు 28న రోజంతా రాఖీలు కట్టుకోవడానికి అనుకూలమైన సమయమని పండితులు వెల్లడించారు.

# ఫోర్జరీ సంతకాలతో రూ. 10 కోట్ల వడ్ల అక్రమాలు!

**- రైస్ మిల్ యజమానిపై బాధితుడి ఫిర్యాదు**

**- చర్యలు తీసుకోవాలని లోకాయుక్త ఆదేశాలు**

**ప్రజా వాయిస్ మంథని**

వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులు సృష్టించి సుమారు రూ. 10 కోట్ల విలువైన ధాన్యం (వడ్లు) దుర్వినియోగానికి పాల్పడిన సంఘటన పెద్దపల్లి జిల్లాలో కలకలం రేపుతోంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం...మంథని గ్రామానికి చెందిన రావికంటి పవన్ కుమార్ అనే వ్యక్తి పేరిట, లక్ష్మి రైస్ మిల్ యజమాని ఒల్లాల సత్యనారాయణ అక్రమాలకు తెరలేపారు. 2021-22 సంవత్సరంలో బ్లాక్ లిస్టులో ఉన్న సత్యనారాయణ, పవన్ కుమార్ ప్రమేయం లేకుండా ఆయన లెటర్ హెడ్లు, రబ్బరు స్టాంపులు, ఫోర్జరీ సంతకాలను ఉపయోగించారు. వాటి ఆధారంగా ప్రభుత్వం నుంచి సుమారు రూ. 10 కోట్ల విలువైన ధాన్యాన్ని పవన్ కుమార్ పేరు మీదికి కేటాయించుకుని, ఆ వడ్లను సొంతానికి వాడుకోవడంతో పాటు ఇతరులకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని బాధితుడు ఆరోపించారు.

**అధికారులు క్రిమినల్ చర్యలు తీసుకోవాలి:**

ఈ అక్రమాలపై బాధితుడు పవన్ కుమార్ ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో పాటు లోకాయుక్తను ఆశ్రయించారు. సదరు మిల్లు యజమానిపై సివిల్ సప్లై అధికారులు, పోలీస్ వ్యవస్థ మరియు విజిలెన్స్ విభాగాలు వెంటనే స్పందించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

**విచారణకు లోకాయుక్త ఆదేశం:**

ఈ ఫిర్యాదుపై స్పందించిన తెలంగాణ లోకాయుక్త, సంబంధిత రికార్డులను పరిశీలించి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)ని ఆదేశించింది. అంతేకాకుండా, ఈ విషయంపై తీసుకున్న చర్యల నివేదికను మూడు నెలల వ్యవధిలో సమర్పించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.






# మత్తుకు దూరంగా ఉండండి

**- సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

**- విద్యార్థులకు మోమిన్‌పేట్ ఎస్సై భరత్ భూషణ్ సూచన**

ప్రజావాయిస్/మోమిన్‌పేట్:

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశాల మేరకు మోమిన్‌పేట్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "నషాముక్త్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై భరత్ భూషణ్ మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలను వివరించి, మత్తు పదార్థాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలు, బాల నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఒటీపీలు, పిన్‌లు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని అనుమానాస్పద లింకులను తెరవవద్దని విద్యార్థులకు సూచించారు. ఇటీవల జరిగిన ప్రిన్సిపాల్ రూపారెడ్డి కేసు దర్యాప్తులో బాల నేరస్థులు ఉన్న నేపథ్యంలో, బాల నేరాల పట్ల కూడా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.విద్యార్థులు క్రమశిక్షణతో విద్యపై దృష్టి సారించి, మాదకద్రవ్య రహిత, సైబర్ సురక్షిత, నేరరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మోమిన్‌పేట్ పోలీసులు కోరారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నాయకులారా మారండి..వనపర్తి ప్రజలకు సేవ చేయండి

**వనపర్తి జిల్లాను అభివృద్ధి చేయడంలో పోటీ పడండి**

**విమర్శలతోనే కాలం గడుపుతారా?**

**అభివృద్ధి మరచి ఆగమైపోతున్న నాయకులు**

**మీ ఆధిపత్య కోసం పోరాటాలు పక్కనపెట్టి ప్రజల అభివృద్ధి వైపు మీ అధికారిని ఉపయోగించండి**

**అఖిలపక్ష ఐక్యవేదిక సూటి ప్రశ్న ?**

ప్రజా వాయిస్.. వనపర్తి

గత కొన్ని రోజులుగా జరుగుతున్న వనపర్తి నియోజకవర్గ పంచాయతీ ప్రజలకు ఏదన్నా పనికి వస్తుందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నట్లు ఐక్యవేదిక నాయకులు అన్నారు. చిన్నారెడ్డి విమర్శలలో టెండర్ల వ్యవహారంలోనే విమర్శలు చేశారా? వీటిపై కమిషన్ల వ్యవహారశీ కోసమేనా... అని ప్రజలు ప్రశ్నించుకుంటునట్లు ఉంది అని ఆయన అన్నారు.మూడు సంవత్సరాల కింద ఉన్న పంచాయతీ సద్దుమణిగి ఆ తరువాత ముగ్గురు నాయకులు ఏకమై



మేమంతా ఒకటే అని చాటి చెప్పారు కదా? మరి ఇప్పుడు ఎందుకు వచ్చింది పంచాయతీ అని ఐక్య వేదిక నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలుకు జవాబు చెప్పవలసిన విషయాలు పక్కన పెట్టి, బల నిరూపణ కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అలాగే మీ పక్కన ఉన్న షాడో నాయకులు ప్రశ్నించే గొంతులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వారు అన్నారు. వారిని కట్టడి చేయకపోతే ఎదురయ్యే పరిణామాలు మీకే రాబోయే రోజుల్లో ఇబ్బందులకు గురికాక తప్పదు అని ఐక్యవేదిక నాయకులు అన్నారు.శనివారం పలు మండలాలు తిరుగుతూ కమిటీలను వేస్తున్న సమయంలో ప్రజల మధ్య చర్చ విని ఈ ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది అని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్ అన్నారు.నాయకులారా ఇంకా రెండు సంవత్సరాల పైగా ఎన్నికలు లేవు దయచేసి ప్రజలు చెప్తున్నట్లుగా ఆధిపత్యం కోసం పోరాటాలు పక్కనపెట్టి ప్రజల అభివృద్ధి వైపు మీ అధికారాన్ని ఉపయోగించాలని ఐక్య వేదిక మిమ్మల్ని కోరుతున్నట్లు తెలిపారు.లేకుంటే ప్రజలంతా ఏకమై రాబోయే రోజుల్లో వనపర్తి లో ఒక బీసీ నాయకుడిని ఎన్నుకునే రోజు వస్తుంది అని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్, టిఆర్పి జిల్లా అధ్యక్షుడు విజయ్ యాదవ్, మహేందర్, భీమన్న, తిరుపతి నాయక్, బాలస్వామి, రమేష్, స్వామి, ఎల్లయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## వన మహోత్సవంలో బండు ప్లాంటేషన్ కార్యక్రమం

**ప్రజా వాయిస్ కౌటాల**
కొమరం భీమ్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా బండు ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటారు. నాటిన మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో గ్రామస్తులు సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ మోర్లె పార్వతి, ఉప సర్పంచ్ మోర్లె సమత, వార్డు సభ్యుడు తిరుమలేష్, పంచాయతీ కార్యదర్శి తొడుపునూరి సాయికృష్ణ, సీసీ శంకర్, టీఏ మంగళ్ సింగ్, ఎఫ్ఏ వెంకటేష్, వీఓఏ దేవాజి, కరోబార్ నాగేష్, మేట్ రాజశేఖర్, భూ యజమాని లెండుగూరె బాపూరావు, గ్రామస్తులు పాల్గొన్నారు



## గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలపై మంత్రికి వినతిపత్రం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
ఉట్నూర్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యలపై సంఘ నాయకులు మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇతర శాఖల మాదిరిగానే గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు విదేశీ విద్యా పర్యటన అవకాశం కల్పించాలని, తద్వారా అంతర్జాతీయ బోధనా పద్ధతులపై అవగాహనతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని కోరారు. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల (సీఆర్టీ) పెండింగ్ టైం స్కేల్ సమస్యను పరిష్కరించాలని, టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలకు ట్యాబ్‌లు అందించి డిజిటల్ విద్యను బలోపేతం చేయాలని, పరిశుభ్రత కోసం సానిటేషన్ వర్కర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రహరీ గోడలు లేని పాఠశాలలకు వాటిని నిర్మించి విద్యార్థుల భద్రత, మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలోటీఎస్‌టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షులు మడావి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ శివాజీ, ఉపాధ్యక్షులు చౌహాన్ నెహ్రూ, చంపావతి, భూమేష్ తదితరులు పాల్గొన్నారు



## మేతకు వెళ్లిన పాడిగేదె మృత్యువాత

**-ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుదాఘాతం.. రూ.1.50 లక్షల నష్టం**
**-అనంతగిరి మండలం రంగయ్యగూడెంలో విషాద ఘటన**
**- పప్పుల సీతారామయ్యకు చెందిన గేదె మృతి**
**- నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు**

**ప్రజా వాయిస్,అనంతగిరి:**
మేతకు వెళ్లిన పాడిగేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం రంగయ్యగూడెంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పప్పుల సీతారామయ్యకు చెందిన పాడిగేదె అమీనాబాద్ పొలాల వద్ద మేతకు వెళ్లింది. పొలాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు లేదా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ ప్రసరణ జరగడంతో గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.కాగా, ఇటీవలే కొనుగోలు చేసిన ఈ గేదె రోజుకు సుమారు 6 నుంచి 8 లీటర్ల పాలు ఇచ్చేదని, దాని విలువ దాదాపు రూ. 1.50 లక్షలు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. పాడిపరిశ్రమపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు గేదె మృతితో తీవ్ర నష్టం వాటిల్లిందని కన్నీరుమున్నీరయ్యారు. సంబంధిత అధికారులు ఘటనపై పరిశీలించి, నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరింది.

# 9వ తరగతి నుంచే 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలి

**అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే 10వ తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తెలిపారు. తిర్యాణి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమై విద్యా ప్రగతి, హాజరు, అభ్యసన సామర్థ్యాలు, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు. 9వ తరగతి నుంచే విద్యా పునాదిని బలోపేతం చేసుకోవాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా



పాఠశాలకు హాజరవుతూ ఇంటి వద్ద కూడా పాఠ్యాంశాలు సాధన చేయాలని సూచించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టిన "విద్యా ప్లస్" కార్యక్రమం గురించి వివరిస్తూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందించడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల విద్యా ప్రగతిని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా వారి ఆసక్తులు, సామర్థ్యాలను ప్రోత్సహించాలని తెలిపారు.

# ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్ల నిర్లక్ష్యం

**సెయింట్ పాల్ స్కూల్ 50 మంది పిల్లల ను కాపాడి న లారీ డ్రైవర్.**
**స్కూల్ బస్ అతి వేగం బ్రేక్ పడక పోవడం డ్రైవర్ నిర్లక్ష్యం.**
**భయానక వాతావరణాన్ని సృష్టించిన ప్రమాదం.**
**ఊపిరి పీల్చుకున్న తల్లి తండ్రులు.**
**అధికారులు చర్యలు తీసుకుంటారా? చేతులు దులుపుతారా?**

**తొర్రూరు ప్రజా వాయిస్...**
తొర్రూర్ మున్సిపల్ పరిధిలో వరుసగా రెండవ రోజు స్కూల్ పిల్లలు ప్రమాదం నుండి బయటపడ్డారు. ఉదయం 8:30 గంటల ప్రాంతంలో మడూర్ నుండి సెంట్ పాల్ స్కూలుకు50 మంది పిల్లలను తీసుకొస్తున్న క్రమంలో స్కూల్ దగ్గర డ్రైవర్ లారీని ఓవర్టేక్ చేసి స్కూల్ లోకి తీసుకెళ్లే లోపల భారీ ప్రమాదం జరిగినది. వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ నీ ఓవర్టేక్ చేసే టైంలో బస్ డ్రైవర్ పిల్లలు ఉన్నారనే విషయం



మర్చిపోయి అతివేగంతో నడపడంతో బ్రేక్ పడకపోవడంతో లారీని దాటే సమయంలో లారీ డ్రైవర్ పూర్తి ఎడమ చేయి వైపు దిగిన భారీ ప్రమాదం జరగక తప్పలేదు. ప్రమాదం పొంచి ఉందనే సమయాన్ని పసిగట్టిన లారీ డ్రైవర్ పూర్తిగా రోడ్డును దింపడంతో భారీ ప్రమాదము జరగకుండా పిల్లల ను రక్షించిన వాడిగా లారీ డ్రైవర్ చాకచక్యానికి పిల్లల తల్లిదండ్రులు రుణపడి ఉంటారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం బస్సు డ్రైవర్లు నిర్లక్ష్య వైఖరితో అధికారులు పిల్లల రక్షణకు పాఠశాల యాజమాన్యం నుండి ఎలాంటి హామీ ఇస్తారు ఈ దుర్ఘటన పై ఆర్ టి ఏ అధికారులు గానీ విద్యాశాఖ అధికారులు కానీ పాఠశాలలపై ఏం చర్యలు తీసుకుంటారనేది ఉత్కంఠతో చూడవలసిన సమయం. ప్రైవేట్ పాఠశాలలను కాపాడేందుకు అధికారులు




సమయతమవుతారో, పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుండి తల్లిదండ్రులకు ఏ విధమైన రక్షణ ఇప్పిస్తారో మునుముందు అధికారులు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఇంత గోర సంఘటన జరిగిన మండల విద్యాశాఖ అధికారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటాము అనేది విలేకరులకు తెలపకపోవడం పిల్లల తల్లిదండ్రులకు ఏం భరోసా ఇస్తారా అనేది అధికారుల ఒంటెద్దు పోకడకు నిదర్శనం. ఏదైనా సంఘటన జరిగితే కానీ చర్యలు తీసుకునే పరిస్థితిలో అధికారులు లేరనేది స్పష్టమైన సంకేతం గా విధితమైతుంది. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడి పాఠశాలలపై చర్యలు తీసుకొని పిల్లల తల్లిదండ్రులకు మేమున్నామని భరోసా కోసం ఎదురుచూస్తున్న తొర్రూర్ మున్సిపల్ ప్రజలు.

# శామీర్‌పేట చెరువులోకి గోదావరి జలాలు మళ్లించాలి

**శామీర్‌పేట చెరువును పరిశీలించిన సీపీఎం బృందం**

**శామీర్‌పేట / ప్రజా వాయిస్ :** శామీర్‌పేట చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి, కొండపోచమ్మ సాగర్ ద్వారా గోదావరి జలాలను మళ్లించి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం జిల్లా, మండల నాయకత్వం శామీర్‌పేట చెరువును సందర్శించి పరిస్థితులను పరిశీలించింది. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. బొమ్మలరామారం, తుర్కపల్లి, భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించగల కీలకమైన ప్రాజెక్టుగా శామీర్‌పేట చెరువును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చెరువును రిజర్వాయర్‌గా మార్చి, సమీపంలోని కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలను తీసుకొచ్చి భువనగిరి వాగులోకి నీటిని విడుదల చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అమలైతే వ్యవసాయంపై



ఆధారపడి జీవించే రైతులు, కూలీలు, వృత్తిదారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మొదటి ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలకులు మారుతున్నా హామీలు మాత్రమే ఇస్తున్నారని, ఆచరణలో మాత్రం ప్రాజెక్టు ముందుకు సాగడం లేదని విమర్శించారు. శామీర్‌పేట చెరువుకు గోదావరి జలాల సాధన కోసం ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి పాదయాత్ర



నిర్వహించనున్నట్లు జహంగీర్ తెలిపారు. 31న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, ఈ ఉద్యమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు, పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, బుర్రు అనిల్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పాదయాత్రకు ప్రజా నీరాజనం!

**డప్పు చప్పుళ్లు.. కోలాటాల నడుమ కదం తొక్కిన కలం యోధులు!**
**స్పందించకపోతే ఆమరణ దీక్షే: జర్నలిస్టుల హెచ్చరిక!**
**మాట తప్పితే దీక్షల బాటే: ఖమ్మం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

**ప్రజా వాయిస్ ఖమ్మం:**
జర్నలిస్టుల చిరకాల స్వప్నమైన ఇళ్ల స్థలాల సాధన కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్--హెచ్ 2843) ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర తొలిరోజు ప్రజా మద్దతుతో అత్యంత ఉత్సాహంగా, దిగ్విజయంగా సాగింది. అమరవీరుడు షోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయన స్వస్థలమైన తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ నుంచి ప్రారంభమైన ఈ యాత్రకు ప్రజలు, ప్రజా సంఘాలు ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి పాదయాత్ర కూసుమంచి మండల కేంద్రానికి చేరుకోగా, స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ కు వినతి అందిస్తూ



జర్నలిస్ట్ లు గత దశాబ్దాల నుండి ఎదుర్కొంటున్న సమస్యలను ఖమ్మం జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు ఖదిర్ వివరించారు. స్పందించిన కలక్టర్ న్యాయబద్దమైన కోర్కెలను తప్పకుండా తమ వంతుగా ముందుకు తీసుకెళ్తామని తెలియజేసారు. అనంతరం, పాదయాత్ర నేలకొండపల్లి మండల కేంద్రానికి చేరుకోగా మహిళల కోలాట నృత్యాలు, డప్పు చప్పుళ్లతో ప్రజలు, స్థానిక జర్నలిస్టులు అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. యాత్ర బాధ్యులు, స్థానిక జర్నలిస్టులు కలిసి స్థానిక తహశీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించి, జర్నలిస్టుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లో సభ నిర్వహించారు. ఈ సభలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వేతనాలతో లేకుండా వెళ్లదీస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులు సాధించే వరకు ఈ ఉద్యమ ప్రస్థానం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రానున్న కాలంలో శాంతియుతంగా ఆమరణ నిరహారదిక్ష చేస్తామని పిలుపునిచారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, మారిశెట్టి వెంకటేశ్వర్లు, పాగర్తి సుధాకర్, పగిదికత్తుల వెంకటేశ్వర్లు, మదాసు వెంకన్న, పాత్రికేయులు కెవి నాగిరెడ్డి, ఎన్డి కర్ణ, కందికొండ శ్రీను, మోర సైదులు, రామదాసు, దుడ్డెల సంజయ్, ఎం వెంకటేశ్వర్లు, కోలేటి నారాయణ, వెంకటేశ్వర్లు, దండ శ్రీనివాస్, పోనగల్ల శ్రీనివాస రెడ్డి, లిక్కి హనుమంత రావు, యలమంచి శివాజీ, పంబ రవి, బ్రహ్మం తదితర పాత్రికేయులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల బలోపేతమే రేవంత్ సర్కార్ లక్ష్యం

## ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

**ప్రజా వాయిస్ : చిన్న కోదూర్**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత లభిస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు.జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు శనివారం ఆయన చిన్నకోదూరులోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు బీసీ హాస్టల్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, బియ్యం, కూరగాయల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి



నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తేనే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. విద్యార్థులు నిరంతరం శ్రమిస్తూ తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకుని వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యురాలు లక్ష్మి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సందబోయిన పర్శరాం యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంద శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పొన్నాల రాజేష్, అంతగిరి చంద్రశేఖర్, కొమ్ము ప్రశాంత్, కోరిమి రాజు, సందబోయిన తిరుపతి, గోపు హరిబాబు, గొట్టిపర్తి చంద్, బర్ల స్వామి, రెడ్డి మహేందర్ రెడ్డి, వద్లూరి అశోక్, నముండ్ల సంజీవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

### షాద్‌నగర్‌లో సాధన జేఏసీ కరపత్రాల ఆవిష్కరణ

### ఈనెల 25వ తేదీ మహాధర్నాను విజయవంతం చెయ్యండి

**(ప్రజా వాయిస్ షాద్‌నగర్)**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగి 13 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు జిల్లాలో ఉన్న జిల్లాలో ఎక్కడికక్కడ పెండింగ్ ప్రాజెక్టులుగానే మిగిలిపోయాయి భూమికి సాగునీరు లేక రైతులు కౌలు రైతులు ఆత్మహత్యలు



పెరుగుతున్నాయి భూమి ఉండి వ్యవసాయానికి సాగునీరులేని రైతన్న ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్న దుస్థితి నెలకొంది పోరాడి సాధించుకున్న పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ నీటిని అక్రమంగా డిండింగ్ కి తరలించే లిఫ్టులు వెంటనే రద్దు చేయాలని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వ తేదీ మంగళవారం నాడు మహబూబ్నగర్ జిల్లా టిటిడి కళ్యాణ మండపం ముందు చేపట్టబోయే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఫెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ చైర్మన్ మిద్దెల సత్యనారాయణ,కొ కన్వీనర్లు రవీంద్రనాథ్, అర్జునప్ప, కో చైర్మన్ బిజిలి సత్యం కోఆర్డినేటర్ తిరుమలయ్య, మందారం నరసింహులు,ఆకాష్, రాము తదితరులు పాల్గొన్నారు..

# శాకాజిపురంలో వరుణ దేవునికి ఘన పూజలు

### సర్పంచ్ గంగలి కృష్ణ ఆధ్వర్యంలో కప్పకాముడు ఆటలు దేవుళ్లకు నీళ్లు పోసి

### వరుణదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం,**

నల్గొండ జిల్లా,గుర్రంపోడు మండల పరిధిలోని శాకాజిపురం గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గంగలి కృష్ణ ఆధ్వర్యంలో కప్పకాముడు ఆటలు నిర్వహించడంతో పాటు దేవుళ్లకు నీళ్లు పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి, పాడిపంటలు కళకళలాడాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని గ్రామస్తులు వరుణ దేవుడిని ప్రార్థించారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గంగలి కృష్ణ మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామంలోని చెరువులు, కుంటలు నిండాలని, రైతులకు మంచి పంటలు పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పాల్వాయిలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందజేసిన సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ

**ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం**

నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలోనిపాల్వాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైరెడ్డి సత్యనారాయణ పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందనున్నాయని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో జిపిఓ రమణ, ఉప సర్పంచ్ మంచికంటి ప్రసాద్, వార్డు సభ్యులు గోగు రమేష్, కొండపల్లి గిరి, గట్టుపల్లి కరుణాకర్, రెడ్డి గిరి, ఆంజనేయులు, నల్ల నందు, గ్రామ పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన జానపద కళాకారిణి మాధురి రాథోడ్‌పై దాడి అమానుషం

### ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

### ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు

### చేయించి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం- కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ హామీ

**ప్రజా వాయిస్/దేవరకొండ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రెడ్డి భవనంలో బస చేసిన ఎస్టీ (లంబాడీ) వర్గానికి చెందిన వర్ధమాన జానపద కళాకారిణి మాధురి రాథోడ్‌పై పథకం ప్రకారం జరిగిన అక్రమ చొరబాటు, భౌతిక దాడి, అసభ్యకర దూషణలు, ఆర్థిక మోసం మరియు సామాజిక మాధ్యమాలలో (సోషల్ మీడియా) వ్యక్తిత్వ హననంపై తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ కి రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ (ఆర్టీఐఎస్-ఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు ఢ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు (తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం) కె. బాబురామ్ నాయక్,రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం ప్రతినిధి ఢ ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ సభ్యులు కొర్ర లక్పతి నాయక్, రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం ప్రతినిధి ఢ ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ నిఘా మరియు పర్యవేక్షణ కమిటీ సభ్యులు రామావత్ ధర్మానాయక్ ముగ్గురూ కలిసి సంయుక్తంగా అధికారిక ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వేములవాడలో చిత్రీకరణ (షూటింగ్) నిమిత్తం విచ్చేసి రెడ్డి భవనంలో ఆర్టీసీ వారికి కేటాయించిన గదిలో బస చేసిన ఒంటరి గిరిజన మహిళ గదిలోకి తోటి నృత్యకారుడు ఈశ్వర్ సాయి భార్య శరణ్య మరియు వారి సహచరులు అక్రమంగా చొరబడి, విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా కొట్టారని తెలిపారు. అనంతరం బాధితురాలి వద్ద ఉన్న సుమారు రూ. 50 వేల విలువైన చరవాణిని (మొబైల్ ఫోన్) బలవంతంగా లాక్కొని దొంగిలించారని వివరించారు. గతంలో బాధితురాలి వద్ద నుండి తీసుకున్న రూ. 10 లక్షల నుండి రూ. 30 లక్షల నగదును తిరిగి ఇవ్వకుండా ఎగ్గొట్టేందుకు మరియు ఆమెను బెదిరింపులతో లొంగదీసుకునేందుకే భార్యాభర్తలు కలిసి ఈ కుట్ర పన్నారని, అత్యంత జుగుప్సాకరమైన బూతులు తిడుతూ ఒక గిరిజన మహిళ ఆత్మగౌరవాన్ని బహిరంగంగా దిగజార్చారని మండిపడ్డారు. ఈ దంపతులు ఆడిన కుట్రను నిజమని నమ్మించేలా యూట్యూబ్, సామాజిక మాధ్యమాలలో అసత్యపు దృశ్యాలు (వీడియోలు), అసభ్యకరమైన చిత్రాలు ప్రసారం చేయించి తీవ్ర పరువు నష్టం మరియు మానసిక వేదన కలిగించారని తీవ్రంగా ఖండించారు.?ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ తీవ్రంగా స్పందిస్తూ.. రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) మరియు



ఉన్నతాధికారులతో వెంటనే మాట్లాడి నిందితులపై తక్షణమే ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్ కాపీ) నమోదు చేయిస్తామని నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. సమగ్ర విచారణ జరిపించి జిల్లా అధికార యంత్రాంగం నుంచి తక్షణ చర్యల నివేదికను (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) తెప్పించుకుని నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.?నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం (ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్), తీవ్ర భౌతిక దాడి, మహిళ గౌరవానికి భంగం కలిగించిన చట్టాల కింద బెయిల్ రహిత కేసులు నమోదు చేసి వెంటనే బంధించాలని (అరెస్ట్), రూ. 10--30 లక్షల నగదు రికవరీ మరియు ఫోన్ చోరీపై నిష్పక్షపాత విచారణ జరపాలని, సమాచార సాంకేతిక చట్టం (ఐటీ యాక్ట్) కింద సామాజిక మాధ్యమాలలోని అసభ్యకర దృశ్యాలను సైబర్ క్రైమ్ విభాగం ద్వారా తక్షణమే తొలగించాలని, బాధితురాలికి పోలీసు రక్షణతో పాటు ప్రభుత్వ బాధితుల సహాయ నిధి అందించాలని నేతలు డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ సంఘాల పక్షాన రాజీలేని న్యాయ పోరాటం కొనసాగిస్తామని కె. బాబురామ్ నాయక్, కొర్ర లకపతి నాయక్, రామావత్ ధర్మానాయక్ స్పష్టం చేశారు.



# జీవో నంబర్ 97 రద్దు చేయాలని పీడీఎస్యూ నిరసన

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యను స్కిల్ ఇండియా ప్రైవేట్ యూనివర్సిటీలో విలీనం చేసే జీవో నంబర్ 97ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ జీవో వల్ల పాలిటెక్నిక్ విద్య ఐటీఐతో సమానంగా ఒకేషనల్ కోర్సుగా మారే ప్రమాదం ఉందని, పాలిటెక్నిక్ విద్యార్థులు నేరుగా బీటెక్ చేసే అవకాశం కోల్పోతారని పీడీఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి తెలిపారు. ప్రైవేట్ యూనివర్సిటీలో విలీనం వల్ల పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులపై ఫీజుల భారం పెరుగుతుందని, జీవో 97ని వెంటనే రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త విద్యార్థి ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్యూ మండల అధ్యక్ష కార్యదర్శులు సమీర్, తరుణ్, జిల్లా నాయకులు గౌరీ వసంత్, మండల ఉపాధ్యక్షులు శివశంకర్, మండల కోశాధికారి సిరాజ్, నాయకులు ఫరియాజ్ ఖాన్, శివ ప్రసాద్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు



# నేను ముసలోడినాట.. కట్టే పట్టుకుని నడుస్తానట

## రేవూరి ప్రకాష్ రెడ్డి

**ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల**

తనపై కొందరు చేస్తున్న విమర్శలపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తన గురించి తప్పుగా మాట్లాడే వారికి వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు.నిత్యం ప్రజల మధ్య ఉండటం, ప్రజా సమస్యలపై స్పందించడమే తనకు తెలుసని స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని మాట్లాడినా సహనం కోల్పోయి మాట్లాడే వ్యక్తిని కాదని పేర్కొన్నారు."నేను ముసలోడినాట.. కట్టే పట్టుకుని నడుస్తానట.. నా గురించి ఎవరు ఎలా మాట్లాడినా వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే నా పని" అని రేవూరి ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యానించారు.ఇటీవల పరకాల రాజకీయాల్లో రేవూరి ప్రకాష్ రెడ్డి పేరు చుట్టూ రాజకీయ చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల**

పరకాల పట్టణ కేంద్రంలోని రాజుపేట లో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి అయుబ్ తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా,సమయానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మేమే చేస్తాం అని అన్నారు.



## సర్ సిల్క్ చిరు కూరగాయల వ్యాపారుల సమస్యపై సానుకూల చర్చలు

ప్రజా వాయిస్ కగజ్ నగర్
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సర్ సిల్క్ ప్రాంతంలో 20 ఏళ్లుగా కూరగాయలు అమ్ముకుంటున్న చిరు వ్యాపారుల సమస్యపై మాలి సంక్షేమ సంఘం కాగజ్‌నగర్ మండలం అధ్యక్షుడు విజయ్, జనరల్ సెక్రెటరీ వసాకే హన్మంతు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ నేతృత్వంలో సంఘం పెద్దలు, చిరు వ్యాపారులు, రైతులు మున్సిపల్ చైర్మన్ షేక్ సహీన్ సుల్తానాతో చర్చలు జరిపారు. కూరగాయల మార్కెట్‌లోని అక్రమ కట్టడాలు, ఆక్రమణలను వారం రోజుల్లో తొలగిస్తామని, అప్పటివరకు వ్యాపారులు రామ్ మందిర్ టెంపుల్ పక్కన వ్యాపారం చేసుకోవచ్చని చైర్మన్ హామీ ఇచ్చారు. హెల్పర్ వెల్ఫేర్ గ్రౌండ్ సమీప స్థలం వ్యాపారులకు అనుకూలంగా ఉంటే అక్కడ ప్రత్యేక కూరగాయల మార్కెట్ నిర్మించి, తాగునీటి నల్లాలు, మరుగుదొడ్లు, లైటింగ్‌తో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలియజేశారు. చైర్మన్ సానుకూల స్పందనతో చర్చలు విజయవంతంగా ముగిశాయి. జీవనోపాధికి పరిష్కారం చూపిన చైర్మన్, కౌన్సిలర్లకు వ్యాపారులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



## దోమల బెడద, వీధి దీపాల సమస్యలపై కమిషనర్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి

ప్రజా వాయిస్ కగజ్ నగర్
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో దోమల బెడద, వీధి దీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. పలు వార్డుల్లో దోమల బెడద పెరుగుతుండటంతో ఫాగింగ్, యాంటీ-లార్వా మందుల పిచికారీ, డ్రైనేజీల శుభ్రత, నిల్వ నీటి తొలగింపు చర్యలు క్రమం తప్పకుండా చేపట్టాలని కోరారు. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.పనిచేయని వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేసి, దీపాలు లేని ప్రాంతాల్లో కొత్త ఎల్ఈడీ లైట్లు, ల్యాంప్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, చీకటి ప్రాంతాల్లో భద్రత కోసం ప్రత్యేక సర్వే నిర్వహించాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ రెండు సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.




## ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి జమేష్ రంజన్

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణంలో భాగంగా ప్రతి ఒక్కరికి శారీరక, భౌతిక అక్షరాస్యతపై అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర క్రీడా శాఖ ప్రత్యేక కార్యదర్శి జమేష్ రంజన్ తెలిపారు. హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులతో ఫిజికల్ లిటరసీపై జిల్లా స్థాయి కార్యక్రమాల అమలుపై వర్చువల్ ఓరియంటేషన్ నిర్వహించారు. నిత్యజీవితంలో యోగ, క్రీడలు, నడక, వ్యాయామం తప్పనిసరని, ప్రతి ఒక్కరూ శారీరక, భౌతిక అక్షరాస్యత కలిగి ఉండాలని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ అనుసంధానంతో జిల్లా స్థాయిలో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రణాళిక, సమన్వయం, అమలును పర్యవేక్షించాలని సూచించారు.జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ హాజరయ్యారు. అధికారుల సమన్వయంతో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతామని, పాఠశాల విద్యాశాఖ, ఒలంపిక్ అసోసియేషన్, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు, క్రీడా క్లబ్బుల సభ్యులను భాగస్వామ్యం చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.



## అనుమతులు లేని నిర్మాణాలను అడ్డుకోవాలి

**- జోగిపేటలో ముదిరాజ్ సంఘం ఆనుకొని ఉన్న స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం**

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
జోగిపేట పట్టణంలోని తూర్పు గౌని ముదిరాజ్ సంఘానికి ఆనుకొని ఉన్న కందకం ఖాళీ స్థలాన్ని ( శ్రీ అయ్యప్ప విజయ్ ) అక్రమంగా ఆక్రమించి, ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అనధికార నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయించి, చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జోగిపేట పట్టణంలోని తూర్పు గౌని ముదిరాజ్ సంఘంకు చెందిన సభ్యులు . మా సంఘ ప్రాంగణానికి ఆనుకొని వెనుక వైపున ఉన్న కందకం ఖాళీ స్థలాన్ని శ్రీ అయ్యప్ప విజయ్ ఎటువంటి హక్కు పత్రాలు, స్వామ్య ఆధారాలు లేదా చట్టబద్ధమైన మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమంగా ఆక్రమించి, అక్కడ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ అక్రమ ఆక్రమణ మరియు నిర్మాణ విషయమై ఇప్పటికే ఒకసారి కమిషనర్ గారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు, వినతిపత్రం సమర్పించాము. దానిపై స్పందించిన కమిషనర్ స్వయంగా స్థలాన్ని సందర్శించి, సంబంధిత వ్యక్తిని పనులు నిలిపివేయాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాలను పూర్తిగా లెక్కచేయకుండా ప్రస్తుతం మళ్లీ ఎవరికీ తెలియకుండా, ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇది సాధారణ నిర్మాణ వివాదం కాదని, ప్రజా ప్రయోజనానికి సంబంధించిన ఖాళీ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి, అధికారుల ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ నిర్మాణం కొనసాగిస్తున్న తీవ్రమైన విషయం అని మా సంఘం తరపున తెలియజేస్తున్నాము.





## వెల్దుర్తిలో ప్లాస్టిక్‌పై విద్యార్థుల అవగాహన ర్యాలీ

వెల్దుర్తి ప్రజా వాయిస్
ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వెల్దుర్తి మండల కేంద్రంలోని భాష్యం విద్యా మందిర్ పాఠశాల విద్యార్థులు శనివారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేయాలని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా వస్త్ర సంచులను వినియోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. ర్యాలీతో పట్టణ ప్రజల్లో ప్లాస్టిక్ వ్యతిరేక అవగాహన కల్పించారు.



## దోమకొండ ఎంపీడీఓ ను సన్మానం వార్డు సభ్యుల ఫోరం

ప్రజా వాయిస్ దోమకొండ ఆగస్టు 22
దోమకొండ మండల వార్డు సభ్యుల పోరం తరపున శనివారం దోమకొండ మండల ఎంపిడిఓ మధురిమ కు శాలువతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివయ్యపల్లి సంతోష్ కుమార్ ఉపాధ్యక్షులు కుమ్మరి సేనాపతి ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి కోశాధికారి నిమ్మ నందు గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మహిళా విభాగం అధ్యక్షురాలు తెడ్డు స్వప్న ఉపాధ్యక్షురాలు ఆశం మౌనిక ప్రధాన కార్యదర్శి నరసవ్వ మెట్టు ప్రశాంత్ గౌడ్ కందుకూరి ప్రభాకర్ సలహాదారులు పడకంటి రవికుమార్ సురభి రాజేశ్వరరావు పాల్గొన్నారు

## నవజాత శిశు మృతి

**కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ముందు బంధువుల ఆందోళన ధర్నా**






ప్రజా వాయిస్ కామారెడ్డి/
కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో నవజాత శిశువు మరణించడంతో బంధువులు ఆసుపత్రి ముందు ధర్నా చేపట్టి ఆందోళన నిర్వహించారు. పురిటి నొప్పులకు వస్తే శిశువును మరణించిందని లింగంపేట తాడువాయి మండల వాసులు బాధితుల బంధువులు ఆరోపించారు. లింగంపేట మండలం ఎక్క పల్లి తండాకు చెందిన సరిచందు స్వరూప శుక్రవారం కామారెడ్డి జనరల్ ఆసుపత్రిలో పురిటి నొప్పులకు అడ్మిట్ అయ్యారు. చెక్క పలికి తనకి చెందిన సరి చంద్, తాడ్వాయి మండలం నందివాడ చెందిన స్వరూపకం 15 మాసాల క్రితం పెళ్లయింది. పురిటి నొప్పులకు స్వరూప ను కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం చేర్పించారు. సిజెరియన్ ఆపరేషన్ చేద్దామని డాక్టర్లు చెప్పారు. శనివారం ఉదయం ప్రసూతి వార్డు తీసుకెళ్లారు. బాబు పుట్టిన ,చనిపోయిన విషయం చెప్పలేదని స్వరూప తల్లిదండ్రులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం తోని నవజాత శిశువు మరణించి ందని బాధితుల బంధువులు తల్లిదండ్రులు రెండు మండలాల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. బాబు పుట్టి చనిపోయిన విషయం కూడా తమకు తెలియదని బాధితురాలు స్వరూప రోధిస్తూ తెలిపింది. లింగంపేట మండలం చెందిన బాధితుల బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. బంధువుల ఆందోళనతో ఆసుపత్రి నుండి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రి వైద్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆందోళనకారులను శాంతింపజేశారు. తమ నవజాత శిశువు మరణానికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని బంధువులు ఆరోపించారు.



## ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

**- మహిళలు సద్వినియోగం చేసుకోవాలి**

**- సర్పంచ్ బండ విష్ణువర్ధన్ రెడ్డి**

ప్రజా వాయిస్/మోమిన్‌పేట్:
మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ బండ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మోమిన్‌పేట్ మండలం టేకులపల్లి రైతు వేదికలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఒక విడతలో 30 మంది మహిళలకు నెల రోజుల పాటు నైపుణ్యం కలిగిన శిక్షకులతో ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ అస్లాం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణారెడ్డి, ఏపీఎం మధుకర్, ఏపీఓ పెంటయ్య, ఐకేపీ సిబ్బంది నాగయ్య, వెంకటయ్య, గోవర్ధన్, మాజీ ఉపసర్పంచ్ పాషా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ అభివృద్ధికి కృషి

**- వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య**

**- రూ.1.5 కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**

ప్రజావాయిస్/వికారాబాద్:
వికారాబాద్ పట్టణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ పర్సన్ గడ్డం అనన్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 26, 31, 33 వార్డుల పరిధిలో సుమారు రూ. 1.5 కోట్ల మునిసిపల్ నిధులతో చేపట్టనున్న నూతన రోడ్లను మునిసిపల్ చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే మునిసిపల్ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీవాసులకు రాకపోకల ఇబ్బందులు తొలగించేందుకు రహదారుల విస్తరణ, నూతన రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మునిసిపల్ అధికారులు, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.



## రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం!

**- సామాన్యులపై అధికారుల దూకుడు..**

**- సంపన్నులకేమో 'జీరో' రూల్స్**

ప్రజా వాయిస్ రామగిరి
మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల వైఖరి పట్ల డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చే పేదలను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు.రైతులు, భర్తను కోల్పోయిన మహిళలు మీసేవ ద్వారా కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఆర్‌డబి ప్యాకేజీ కోసమే అనే సాకుతో ఎమ్మార్వో లాగిన్‌లో ఆకారణంగా రిజెక్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని ఆధారాలున్నా అప్లికేషన్లను తిరస్కరించడం వల్ల పేదలు సంక్షేమ పథకాలకు, ఇన్సూరెన్స్‌కు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కల్యాణలక్ష్మి దరఖాస్తులకు నోటరీ ఉండాలంటూ హుకుం జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి రామగిరి తహసీల్దార్ కార్యాలయంపై విచారణ జరిపించి, అర్హులకు సకాలంలో సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నాశనం చేస్తే ఊరుకోం

**ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్**

**ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్**

**షాద్‌నగర్‌లో ఆర్డిఓ కార్యాలయం ముట్టడి విద్యార్థుల ఆందోళన**





(ప్రజా వాయిస్ షాద్‌నగర్)
షాద్‌నగర్ నియోజకవర్గంలో పాలిటెక్నిక్ విద్యను కాపాడాలని, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి ఆర్డిఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఆందోళన కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు విద్యార్థులను అక్కడి నుంచి తరలించారు. అనంతరం ఆర్డిఓ స్వయంగా విద్యార్థుల వద్దకు వచ్చి వారి సమస్యలను విన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఎలాంటి నిర్ణయాలను విద్యార్థి సంఘాలు అంగీకరించబోవని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాలని విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలని డిమాండ్ చేశారు.

పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించే వరకు విద్యార్థుల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు.. పాలిటెక్నిక్ విద్యార్థి, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఊర కుక్కలతో జీవరాసుల వేట.. ఆపై వీడియో సోషల్ మీడియాలో పోస్ట్

**వేటాడుతున్న వీడియో తీసి ఇంస్టాగ్రామ్ అకౌంట్ లో పోస్ట్ చేసుకున్న వేటగాడు**

**సోషల్ మీడియాలో వీడియో వైరల్**

**కేసు నమోదు చేసి వేటగాడిని జిల్లా కోర్టులో హాజరు పరిచిన అటవీశాఖ అధికారులు**

**14 రోజుల రిమాండ్ విధించిన జిల్లా కోర్టు జడ్జి.**

ప్రజా వాయిస్ పాల్వంచ
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని ఉల్వనూర్ గ్రామానికి చెందిన యాస చంటి అనే వ్యక్తి 14/08/2026 శుక్రవారం నాడు నరసింహ సాగర్ బీట్, రేగులగూడెం సెక్షన్, యానంబైల్ రేంజ్ పరిధిలోని అడవిలో ఊర కుక్కలను సహాయంతో ఉడుము వంటి జీవరాశులను వేటాడడం జరిగింది. ఈ తరుణంలో జీవరాశులను వేటాడుతున్న వీడియోను తీసిన చంటి సోషల్ మీడియా అయినటువంటి ఇంస్టాగ్రామ్ ద్వారా తన అకౌంట్లో వీడియో పోస్ట్ చేయడం జరిగింది. వైరల్ అయిన వీడియోను గమనించిన అటవీశాఖ అధికారులు చంటిని 22/08/2026 శనివారం నాడు అదుపులోకి తీసుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో హాజరు పరచడం జరిగింది. కేసును పరిశీలించిన జిల్లా కోర్టు జడ్జి చంటి కి భద్రాచలం సబ్ జైల్ నందు14 రోజుల రిమాండ్ విధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి.కవిత మాధురి, ఎస్ కృష్ణయ్య, కల్పన, రాంబాబు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



# జీవో 97 ను వెంటనే రద్దు చేయాలి

**బీజేవైఎం ఆధ్వర్యంలో పాలిటెక్నికల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ, ధర్నా..**

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే జీవో నెంబర్ 97 ను రద్దు చేయాలని నిరసిస్తూ జహీరాబాద్ లో శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో రంజోల్ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ విద్యారులకు మద్దతు తెలిపి పాలిటెక్నికల్ కాలేజ్ నుండి జాతీయ రహదారి వరకు ర్యాలీ, ధర్నా చేపట్టడం జరిగింది. పాలిటెక్నికల్ విద్యార్థుల భవిష్యత్ నాశనం చేయకుండా పాలిటెక్నికల్ కాలేజ్ ను ప్రైవేటీకరణ చేయొద్దని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తామని బీజేవైఎం నాయకులు కోరారు.. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సోమ అనీల్, రమేష్ రెడ్డి, నరేష్ పాటిల్, అఖిలేష్ యాదవ్, ప్రవీణ్, కార్తీక్, రాజు, పాండు, రాజేష్, మరియు పాలిటెక్నికల్ విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..





# ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందికి సూచనలు

**జిల్లా వైద్య అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్**

వెల్దుర్తి ప్రజా వాయిస్
మెదక్ జిల్లా వెల్దుర్తి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సరైన వైద్యం అందించాలని సూచించారు. త్వరలో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మొబైల్ ఎక్స్ రే స్కానింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని, మండల పరిధిలోని రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది కొరత త్వరలోనే తీరుస్తామని పూర్తిస్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్, జిల్లా ఉప వైద్యాధికారి అనిల్ కుమార్, డాక్టర్ శిరీష ఆశ వర్గాలు సిబ్బంది పాల్గొన్నారు



# ఎగరడంలో సత్తా.. వరుణ్ సాయికి స్వర్ణ పతకం

-పద్నాలుగేళ్లలోపు బాలుర విభాగంలో ప్రథమ స్థానం

- జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అద్భుత ప్రతిభ
- రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక
- విద్యార్థిని అభినందించిన పాఠశాల యాజమాన్యం

ప్రజా వాయిస్,కోదాడ:
సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన ఏడో తరగతి 'బి' విద్యార్థి యు. వరుణ్ సాయి ఎత్తుకు దూకే పోటీలో సత్తాచాటి స్వర్ణ పతకం సాధించాడు. పన్నెండో తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన దక్షిణ మండల జిల్లా స్థాయి ఎంపికల్లో పద్నాలుగేళ్లలోపు బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ విజయంతో వరుణ్ సాయి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సూర్యాపేట జిల్లా తరపున ఎంపికయ్యాడు. విద్యార్థి సాధించిన ఘన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్. వీరయ్య, ఏటీపీ బ్రహ్మచారి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, మట్టయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.



# అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ప్రజాసేవకుడు పగడాల సైదులు యాదవ్ ఆర్థిక సహాయం

ప్రజా వాయిస్:-
తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన అనుముల గామ్మ అనారోగ్యంతో మృతి చెందారు ఆమె మృతి చెందిన విషయం తెలుసుకున్న ప్రజా సేవకుడు పగడాల సైదులు యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పూలమాలలు వేసి నివాళు లర్పించారు అనంతరం తన సేవా కార్యక్రమంలో ముత్యురాలు కుమారుడు అనుముల యేసుకు 10000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు ఎక్కడ ఎవరికైనా ఏ ఆపద ఎదురైన తన వంతు సాయం చేసేందుకు ముందుకు వస్తూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేస్తూ వారి ఆశీర్వాదాలు పొందుతున్నారు ప్రజాసేవ చేయడమే తన కర్తవ్యం గా భావిస్తూ తనదైన శైలి ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందుతున్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పగడాల పున్నమ్మ- సైదులు,గ్రామ పెద్దలు దండం శ్రీను, ఇరిగి సైదులు, అనుముల సోమయ్య, అనుముల గోపి తదితరులు పాల్గొన్నారు.




# ఎల్పీజీ గ్యాస్ ఈ-కేవైసీ కి మరో అవకాశం.. ఆగస్టు 31 వరకు గడువు

**ప్రజావాయిస్ దోమకొండ, ఆగస్టు 22**
ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి ఈ-కేవైసీ పూర్తి చేసుకునే గడువును ఆగస్టు 31 వరకు పొడిగించింది. సర్వర్ సమస్యలు, ఓటీపీ ఆలస్యం తదితర సాంకేతిక ఇబ్బందులతో పలువురు వినియోగదారులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోలేకపోవడంతో గడువు పెంచినట్లు అధికారులు తెలిపారు. దోమకొండ మండలంలోని భారత్ గ్యాస్, వినియోగదారులు సమీపంలోని గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని సూచించారు. అలాగే సంబంధిత కంపెనీల అధికారిక యాప్‌ల ద్వారా కూడా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వినియోగదారులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

# జీవో 97 ను వెంటనే రద్దు చేయాలి

**బీజేవైఎం ఆధ్వర్యంలో పాలిటెక్నికల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ ధర్నా..**



**ప్రజా వాయిస్ జహీరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే జీవో నెంబర్ 97 ను రద్దు చేయాలని నిరసిస్తూ జహీరాబాద్ లో శనివారం నాడు బీజేవైఎం ఆధ్వర్యంలో రంజోల్ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ విద్యారులకు మద్దతు తెలిపి పాలిటెక్నికల్ కాలేజ్ నుండి జాతీయ రహదారి వరకు ర్యాలీ ధర్నా చేపట్టడం జరిగింది. పాలిటెక్నికల్ విద్యార్థుల భవిష్యత్ నాశనం చేయకుండా పాలిటెక్నికల్ కాలేజ్ ను ప్రైవేటీకరణ చేయొద్దని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తామని బీజేవైఎం నాయకులు కోరారు.. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సోమ అనీల్, రమేష్ రెడ్డి, నరేష్ పాటిల్, అఖిలేష్ యాదవ్, ప్రవీణ్, కార్తీక్, రాజు, పాండు, రాజేష్, మరియు పాలిటెక్నికల్ విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..